వానవిల్లు ఊసులు



కొండలబారుతో తెల్లని మబ్బులు పోటీపడ్డాయి. తేలాడుతూవచ్చి నగరానికి గొడుగుపట్టాయి. దిగ్గున మెరిసి, ఢమఢమ ఉరిమి.. కారునలుపును పులుముకున్నాయి. చల్లని గాలి పలకరించగానే ఇంద్రధనుస్సు పురివిప్పుకుంది. ఝల్లున కురిసిన వానకు నగరం తడిచి ముద్దై పులకరించింది. శుక్రవారం సాయంత్రం తిరుపతిలో కనిపించిన దృశ్యాలు

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి





తల్లి.. తబ్బిబ్బయి



- పిల్లలు ఎందరున్నా 'తల్లికి వందనం'
- వైసీపీతో పోలిస్తే రూ.54.562 కోట్ల అదనపు ప్రయోజనం
- పేద కుటుంబాల్లో పండగ వాతావరణం

2025.. తల్లికి వందనం	2023.. అమ్మఒడి
అర్హులు: 2,10,407 మంది	అర్హులు: 1,68,367 మంది
జమ చేసింది: రూ.273.52 కోట్లు	జమ చేసింది: రూ.218.87కోట్లు

వ్యత్యాసం: వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పుడు 40,040 మంది పిల్లలకు అదనంగా ప్రయోజనం లభించింది. రూ.54.6520 కోట్లు అదనంగా జమయింది.

ఒక బిడ్డ ఉంటే రూ.13 వేలు. ఇద్దరికైతే రూ.26 వేలు.. ముగ్గురున్న వారికి రూ.39 వేలు. ఇలా 'తల్లికి వందనం' పథకం కింద శుక్రవారం తల్లుల ఖాతాల్లో నగదు జమ అయింది. గత ప్రభుత్వం ఎంత మంది పిల్లలుంటే అంతమందికి 'అమ్మ ఒడి' ఇస్తామని, చివరకు ఒకరికేనంటూ మోసం చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎన్నికల నాటి హామీని నిలబెట్టుకోవడంతో విద్యార్థుల తల్లులకు వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే రూ.54.562 కోట్ల వరకు అదనపు లబ్ధి చేకూరింది. అలాగే, 42 వేల మంది పిల్లలకు అధికంగా మేలు కలిగింది. అదే సమయంలో ఒకరికంటే ఎక్కువ మంది పిల్లలున్న తల్లులకు రెట్టింపు నుంచీ నాలుగు రెట్ల వరకూ ప్రభుత్వం నుంచీ ఆర్థిక సాయం అందింది. స్కూలు, ఇంటర్ చదివే పిల్లలు ఎంత మంది ఉన్నా అందరికీ నగదు జమ కావడంతో ఆయా కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంటోంది. ముఖ్యంగా ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలుండి లబ్ధి అందుకున్న కుటుంబాల్లో సంబరం చెప్పనలవి కావడం లేదు.



తమ ఖాతాల్లో నగదు జమయిందా అని సూళ్లూరుపేటలోని యూనియన్ బ్యాంకులో చెక్ చేసుకుంటున్న తల్లులు

మొత్తమ్మీద జిల్లాలో తల్లికి వందనం పథకం కింద లబ్ధి పొందిన 1.40 లక్షల కుటుంబాల్లో సంబరం మిన్నంటింది. లబ్ధిదారుల ముఖాల్లో ఆనందోత్సాహాలు స్పష్టంగా కనిపించాయి. తల్లికి వందనం నిధులు బ్యాంకు ఖాతాలో జమ అయినట్టు మొబైల్ ఫోన్లకు వచ్చిన సంక్షిప్త సందేశాలు చూసుకుని మురిసిపోతూ కనిపించారు. కొంత మంది తమ ఖాతాల్లో నగదు జమ అయిందా లేదా అని చెక్ చేసుకుంటూ, మరికొంత మంది నేరుగా బ్యాంకుకు వెళుతూ హడావిడిగా కనిపించారు. ఖాతాల్లో నగదు జమయిన వారు ఆ విషయం ఇరుగుపొరుగు వారితో చెప్పుకుని సంబరపడ్డారు. శుక్రవారం రోజంతా దాదాపు ఎక్కడ చూసినా దీనిపైనే ఎక్కువగా చర్చ సాగింది.

ప్రత్యేకత: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' కింద నగదు జమ చేసింది.

నిరుపేద కుటుంబానికి పెద్ద సాయం



పిల్లలతో చిరు వ్యాపారి భవాని

తిరుపతి ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న భవానీ, అశోక్ దంపతులకు నలుగురు ఆడ పిల్లలు. భవానీ తోపుడు బండిపై కాస్మోటిక్స్ విక్రయిస్తూ, అశోక్ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. నలుగురు పిల్లల్లో ముగ్గురు.. కారుణ్య (టెన్త్), భార్గవి (తొమ్మిది), వైష్ణవి (4వ తరగతి) చదువుతున్నారు. ఈ ముగ్గురికీ కలిపి తల్లి భవాని బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం శుక్రవారం రూ.39 వేలు జమ చేసింది. దీంతో ఆ కుటుంబీకుల సంతోషానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి. 'గత ప్రభుత్వం ఒకరికే అమ్మఒడి నగదు వేయగా.. ఇప్పటి ప్రభుత్వం ముగ్గురు పిల్లలకు నగదు వేసింది. ఇలా మా పేద కుటుంబానికి ప్రభుత్వం పెద్ద సాయం చేసింది. సీఎం చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం. ఈ డబ్బును ఆడపిల్లల చదువులకే ఖర్చు పెడతాం' అని భవాని అన్నారు.

మరమగ్గం కార్మికుల ఇంట సంబరం



ముగ్గురు పిల్లలతో సుమతి, త్యాగరాజన్ దంపతులు

పుత్తూరు పట్టణానికి చెందిన సుమతి, త్యాగరాజన్ దంపతులు మరమగ్గాల్లో నేత కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరికి పవిత్ర (6వ తరగతి), అనుష్క (5వ), వేద (మూడో తరగతి) పిల్లలు. తమ కూలి డబ్బులతో వీరు ముగ్గురు పిల్లలను చదివించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. మూడవ తరగతి చదువుతున్నారు. శుక్రవారం సుమతి బ్యాంకు ఖాతాలో రూ.39 వేలు జమయినట్టు మొబైల్ ఫోన్‌కు మెసేజ్ రావడంతో ఆ ఇంట్లో ఒక్కసారిగా సంబరం నెలకొంది. 'గతంలో ఒక బిడ్డకే అమ్మ ఒడి కింద నగదు వచ్చింది. ఇప్పుడు ముగ్గురికీ ఒకేసారి బ్యాంకులో డబ్బు పడడం చాలా సంతోషాన్నిస్తోంది' అని సుమతి చెప్పారు.



ముగ్గురు పిల్లలతో అమరావతి

బిడ్డల చదువుకు ఎంతో ఉపయోగం

బాలాయపల్లి మండలం ఎన్‌సీ కండ్రిగకు చెందిన అమరావతికి ముగ్గురు ఆడపిల్లలు. పెద్దమ్మాయి మమత సెవెన్త్, లక్ష్మీ దీప్తి 4వ తరగతి, స్నేహ 2వ తరగతి చదువుతున్నారు. మునుపు వైసీపీ ప్రభుత్వంలో ఒకరికే అమ్మఒడి వేశారని, ఇపుడు సీఎం చంద్రబాబు ఎన్నికల హామీ ప్రకారం ముగ్గురికీ బ్యాంకులో రూ.13 వేలు చొప్పున నగదు జమ చేయడం చాలా సంతోషంగా ఉందని అమరావతి చెప్పారు. తన ముగ్గురు పిల్లలకు చేసిన ఆర్థిక సాయం బిడ్డల చదువుకు ఎంతో ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. ఈ డబ్బును బిడ్డల చదువుకే ఖర్చు పెడతామని స్పష్టం చేశారు.



ముగ్గురు పిల్లలతో మమత

పేద కుటుంబానికి ఊహించని సాయం

ఈ ఫొటోలో కనిపిస్తున్నది డక్కిలికి చెందిన అంకుపల్లి మమత, ఆమె ముగ్గురు ఆడ బిడ్డలు. ఈ పిల్లలు ముగ్గురూ డక్కిలిలోనే ప్రభుత్వ స్కూల్లో చదువుతున్నారు. మమత భర్త కారు డ్రైవరుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ముగ్గురు పిల్లలకూ ఒకేసారి రూ.13 వేల లెక్కన తన బ్యాంకు ఖాతాలో రూ.39 వేలు జమ అయినట్టు ఫోన్‌కు మెసేజ్ వచ్చిందని మమత చెప్పారు. దాంతో పట్టలేని సంతోషం కలిగిందన్నారు. తమలాంటి పేద కుటుంబానికి చంద్రబాబు ప్రభుత్వం నుంచీ ఇది ఊహించని సాయమన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

శేషాచలంలో కొత్త పాము

- తూర్పు కనుమల్లో తొలిసారిగా రియోపా డెక్కనెన్సిస్ గుర్తింపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యానికి కేంద్రమైన శేషాచలంలో మరో అరుదైన పాము కనిపించింది. రియోపా డెక్కనెన్సిస్‌గా పిలవబడే ఈ పామును తొలిసారిగా తూర్పు కనుమల్లో గుర్తించారు. ఈ వివరాలు జూటాక్సా అనే ఇంటర్నేషనల్ జర్నల్‌లో జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జడ్ఎస్ఐ) వెల్లడించింది. కనురెప్పలు అత్యంత పారదర్శకంగా, చారలు విభిన్న రేఖాంశంగా, శరీరం తక్కువ మందంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ జీవిపై పరిశోధనలో హైదరాబాదులోని బయాలజీ రీజినల్ సెంటర్, జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, లండన్‌కు చెందిన నేచురల్ హిస్టరీ మ్యూజియం శాస్త్రవేత్తలు భాగస్వామ్యం వహించారు. సాధారణ పాము కంటే భిన్నంగా ఈ పాముకు శరీరంపై రెండు చోట్ల కాళ్ల ఆకారంగా కనబడుతోంది.

కొండపై ఫ్రీబస్ ట్రయల్ రన్

తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై భక్తులు ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించేలా తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఆర్టీసీ ట్రయల్ రన్ నిర్వహించింది. రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి తిరుమలకు వచ్చిన 10 ఎలక్ట్రిక్ బస్సులను ప్రస్తుతం టీటీడీ ఉచిత బస్సులు తిరుగుతున్న రూట్లలో గురు,శుక్రవారాల్లో తిప్పారు. మరికొన్ని రోజుల పాటు బస్సుల సంఖ్యను పెంచుతూ ఇలానే ట్రయల్‌రన్ నిర్వహిస్తారు.

జాతీయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 3న ప్రకటించే జాతీయ అవార్డులు-2025 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాలలో అత్యున్నత ప్రతిభ, అసాధారణ విజయాలు సాధించిన దివ్యాంగులు, సంస్థలు అర్హులని పేర్కొన్నారు. రాష్ట్రీయ పురస్కార పోర్టల్ 'అవార్డ్స్.జీవోవీ.ఇన్' ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 94405 73537ను సంప్రదించాలని కోరారు.

స్పోర్ట్స్ సర్టిఫికెట్ల పరిశీలన

- 349 మంది హాజరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వర్సిటీల్లో ఎంపీఈడీ కోర్సులో ప్రవేశానికి ఎస్వీయూలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన 349 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఎస్వీయూ వీసీ అప్పారావు, పీజీ సెట్ కన్వీనర్ పీసీ వేంకటేశ్వర్లు పరిశీలించారు.పరిశీలకులుగా శివశంకర్‌రెడ్డి(ఎస్వీయూ),శ్రీనివాస్ (ఎస్కేయూ), రామసుబ్బారెడ్డి (వైవీయూ), పాల్ (ఏఎన్‌యూ) పాల్గొన్నారు.

జిల్లా సివిల్ సప్లై మేనేజరు సుమతి బదిలీ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా సివిల్ సప్లైస్ మేనేజరుగా పనిచేస్తున్న సుమతి అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. చిత్తూరులో పనిచేస్తున్న బాలకృష్ణను తిరుపతికి నియమిస్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఎండీ మంజీర్ జిలానీ సామ్యాన్ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు నుంచి లక్ష్మిని చిత్తూరుకు బదిలీ చేశారు.

ఎన్‌పీసీఐతో బ్యాంకు ఖాతాను అనుసంధానం చేసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): 9, 10 తరగతులు, ఇంటర్ చదువుతున్న షెడ్యూల్ కులాల విద్యార్థులు తల్లికి వదనం పథకంలో స్కాలర్‌షిప్ మంజూరుకు ఎన్‌పీసీఐతో తల్లి బ్యాంకు ఖాతాను అనుసంధానం చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఖాతా లేకపోతే పోస్టల్ బ్యాంకులో నూతన ఖాతాలను తెరచి ఎన్‌పీసీఐతో అనుసంధానం చేసుకోవాలని పేర్కొన్నారు. శనివారం గ్రామ, వార్డు సచివాలయాల్లో పోస్టల్ శాఖ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తోందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హొస్కోటలో ప్రమాదం

లారీని దాటబోయి ఢీకొన్న బస్సు

చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన ఐదుగురి మృతి

ఇద్దరు బస్సు డ్రైవర్లు సహా 14 మందికి గాయాలు

వెదురుకుప్పం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివారు హొస్కోటలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చిత్తూరు జిల్లాకు చెందిన నలుగురు, తిరుపతి జిల్లావాసి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. 14మంది గాయపడ్డారు. తిరుపతి నుంచి బెంగళూరుకు చిత్తూరు-2 డిపో బస్సు గురువారం రాత్రి 31మందితో బయల్దేరింది. తెల్లవారుజామున 2 గంటల సమయంలో హొస్కోట సమీపంలో గొట్టిపుర గేట్ వద్ద లారీని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి ఢీకొట్టింది. బస్సు కుడివైపు సగందాకా తుక్కుతుక్కు అయిపోయింది. డ్రైవర్ వెనుకవైపు కూర్చున్నవారిలో ఐదుగురు మృతిచెందారు. మృతుల్లో తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లెకు చెందిన హరిబాబు కుమార్తె ప్రణతి(5), చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన కె.జనార్దన రెడ్డి కుమారుడు 40రోజుల వయసున్న హేత్విక్, కె.కేశవులురెడ్డి(44), ఎస్ఆర్ పురం మండలం పుల్లూరుకు చెందిన తులసి అలియాస్ తనూజ(22), బెంగుళూరులోని జేపీనగర్‌లో స్థిరపడ్డ గంగాధర నెల్లూరు మండలం మారేడుపల్లెకు చెందిన శారద(43) ఉన్నారు.

గంగమ్మ ఉత్సవాలకని వచ్చి..



ప్రణతి మృతదేహం, చికిత్స పొందుతున్న కాత్యాయని, మాధురి

రామచంద్రాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లికి చెందిన ఒంటే హరిబాబు బెంగళూరులోని ఆర్మీలో ట్రైనింగ్ అధికారిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవుల ముందు వరకూ భార్య రోహిణి, ముగ్గురు కుమార్తెలు స్వగ్రామంలోనే ఉండేవారు. పిల్లలు ఇక్కడే చదివారు. వేసవి సెలవుల్లో బెంగళూరుకు కాపురం మార్చారు. స్వగ్రామంలో గంగమ్మ ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో వచ్చారు. తిరిగి గురువారం రాత్రి బెంగళూరుకు బస్సులో ప్రయాణమవగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈయన చిన్నకుమార్తె ప్రణతి మృతి చెందింది. మిగిలిన ఇద్దరు కుమార్తెలకు తీవ్రగాయాలయ్యాయి.

బంగారుపాళ్యం ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం



వక్కల రాజేంద్రనాయుడు - సాదరయ్య (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి శుక్రవారం అమిత వేగంతో వస్తున్న కారు బంగారుపాళ్యం మండలం తిమ్మోజుపల్లె సమీపంలోని రాజేంద్రనాయుడు మామిడి తోట వద్దకొచ్చేసరికి అదుపుతప్పింది. ఆపై అక్కడున్న సర్వీసు రోడ్డులో నిలబడి మాట్లాడుకుంటున్న తిమ్మోజుపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వక్కల రాజేంద్రనాయుడు (54), తంగరాజు కుమారుడు సాదరయ్య(45)పైకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో రాజేంద్రనాయుడు అక్కడికక్కడే మృతిచెందగా.. సాదరయ్యకు తీవ్రగాయాలై మామిడితోపులోకి ఎగిరిపడ్డాడు. కారు నుజ్జునుజ్జవడంతో అందులోని సయ్యద్ దిలీప్.. సీట్ల మధ్యలో ఇరుక్కుని మృతి చెందాడు. ఆయన భార్య, కుమార్తె, మనవరాలికి తీవ్రగాయాలయ్యాయి. అసురక్షితంగా బయటపడ్డాడు. బంగారుపాళ్యంలో ప్రథమ చికిత్స అందించి చిత్తూరుకు తీసుకెళుతుండగా సాదరయ్య మృతి చెందాడు. కాగా, సాదరయ్య బంగారుపాళ్యం మండలంలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారిగా పనిచేస్తూ రెండ్రోజుల కిందటే గంగవరం మండలానికి బదిలీపై వెళ్లారు.

చంద్రగిరి

దొర వేషంలో గంగమ్మ దర్శనం



అమ్మవారు- బంగారు జడ కుచ్చుళ్ళు ఇస్తున్న దాతలు

చంద్రగిరి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిట్టమీద గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు దొర వేషంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలనంతరం దొర వేషంతో అలంకరించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా చంద్రగిరికి చెందిన శ్రీనివాసుల నాయుడు, భారతిలు నాలుగు గ్రాముల బంగారు జడ కుచ్చుళ్ళు బహూకరించారు. సాయంత్రం శక్తిరాయికి అభిషేకాలు చేశారు. అనంతరం సారెను సమర్పించారు ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఉభయదారులు బోనాల రాఘవరెడ్డి, సరస్వతి, యారాశి రవిచంద్ర, ప్రమీల, యారాశి గురుమూర్తిరెడ్డి, అలేఖ్య, రాజులగారి ఉమాపతిరెడ్డి, సావిత్రి, చంద్రగిరి ప్రజలు పాల్గొన్నారు.

పరదా కప్పితే దుర్వాసన పోతుందా..!



తిరుపతి రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిమీదుగా రామానుజపల్లె వెళ్లే మార్గంలో మురుగునీటితో జనం ఇబ్బందులు పడుతున్నారు. దీనిని బయటకు కనిపించకుండా పరదా కట్టారు. రామానుజపల్లె, గొల్లపల్లె, పైడిపల్లె గ్రామాల ప్రజలకు ఇదే ప్రధానమార్గం. దీంతో ఇక్కడికి చేరుకునే సరికి మురుగు దుర్గంధం భరించలేకపోతున్నారు. సమీపంలోని బేకరిసంస్థ గతంలో కూడా రోడ్డుపక్కనే మురుగునీరు వదిలేస్తుండడంపై స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. మళ్లీ కొన్నిరోజులుగా మురుగు నీటి వ్యర్థాలను రోడ్డుపక్కన పడేసి బయటకు కనిపించకుండా పరదాలు కట్టారని స్థానికులు వాపోతున్నారు.

హెచ్‌ఎం బాధ్యతల స్వీకారం


సునీతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని చేకూరి నాగమనాయుడు ఎర్రమ్మల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా సునీత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు సత్కరించారు. ఎస్‌ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వర్, వెంకట్రామయ్య, కృష్ణార్జునరెడ్డి, దిలీప్‌కుమార్, బ్రహ్మం, శ్రీరాములు, కోటేశ్వరబాబు పాల్గొన్నారు.

మహాభారతం మహోత్సవాల చాటింపు


దామలచెరువులో శిలల ఊరేగింపు

పాకాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు పంచాయతీ పోలిశెట్టిగారిపల్లె భారతంమిట్టలో ఈనెల 15న గణపతిపూజ, 16న ధ్వజారోహణం నిర్వహించాక మహాభారత మహోత్సవాలను ప్రారంభం కానున్నాయి. వేదగిరివారిపల్లె, చుక్కావారిపల్లె, బండకాడపల్లె, కాకర్లవారిపల్లె, మొరవపల్లె, దామలచెరువులో శిలలు ఊరేగించి చాటింపు వేశారు. సోమవారం నుండి హరికథాగానం, 25 నుంచి నాటకాలు ప్రదర్శించనున్నారు.

విద్యార్థుల నమోదు పెంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బాబ్జీ

పాకాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని ఎంఈవోలు బాబ్జీ, లింగయ్యలు కోరారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలల్లో 60 మంది విద్యార్థులు ఉంటేనే హెచ్‌ఎం, నలుగురు ఉపాధ్యాయులుంటారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాల గురించి వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషిచేయాలన్నారు. సమావేశంలో సీఆర్పీలు శ్రీనివాసులు, మునికృష్ణ, ప్రకాష్‌రెడ్డి, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ ఊరేగింపు



రామచంద్రాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గంగిరెడ్డిపల్లి దళితవాడ రేణుక ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉత్సవమూర్తిని మేళతాళాల నడుమ వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారి వైభవాన్ని బుర్రకథరూపంలో వినిపించారు. గర్భాలయం ఎదురుగా అమ్మవారి ప్రతిరూపాన్ని రంగురంగుల ముగ్గుతో తీర్చిదిద్దారు. గ్రామస్థులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



రామచంద్రాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సొరకాలయపాళెం ఉన్నత పాఠశాలలో 270మంది విద్యార్థులకు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు యూనిఫాం, బ్యాగులు, పుస్తకాలతో కూడిన ప్రభుత్వ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేరోజు రూ.10వేల కోట్లకుపైగా తల్లికి వందనం పథకాన్ని పథకాన్ని ప్రభుత్వ అమలుచేసిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హరిశంకర్, టీడీపీ నాయకులు సింగయ్యయాదవ్, చంద్రబాబు పాల్గొన్నారు.

ఆలయ కూల్చివేత కేసులో నలుగురి అరెస్టు

తిరుచానూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి తీరంలో వారాహి అమ్మవారి ఆలయం(గుడిసె) తొలగింపు కేసులో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు రోజుల క్రితం కొంతమంది ఈ నిర్మాణాన్ని తొలగించిన సంగతి తెలిసిందే. విగ్రహాన్ని స్వర్ణముఖిలో పడేవేశారు.

ఈ ఘటనపై తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ఈక్రమంలో యాగన్నగారి మణి అలియాస్ మణిరెడ్డి, ప్రమీల, రామిరెడ్డి, హేమాద్రిలను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

రేపట్నుంచి ఉచిత యోగా తరగతులు

తిరుచానూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నుంచి 21 వరకు జరిగే ఉచిత యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో సుధాకర్ కోరారు. ఆయన ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6 నుంచి 8గంటల వరకు మాస్టర్లు చలపతి, నవీన్‌ల ఆధ్వర్యంలో తరగతులు జరుగుతాయన్నారు. తరగతులకు వచ్చే వారు మ్యాట్స్‌ను తెచ్చుకోవాలని సూచించారు.

ఎంపీడీవో బదిలీ

ఎర్రావారిపాలెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి); ఎర్రావారిపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. అరుణ బదిలీ నారాయణవనానికి అయ్యారు. జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఈమేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఏడాది క్రితం ఈమె ఎంపీడీఓగా వచ్చారు. ఒకటి రెండు రోజుల్లో రిలీవ్ కానున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాకాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాకాల 132 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఏఈఈ ప్రశాంత్ ఈవిషయం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాహనం ఢీకొని దెబ్బతిన్న రైల్వే గేటు


ట్రాఫిక్‌కు అంతరాయం

పాకాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు రోడ్డు కుక్కలపల్లె సమీపంలోని రైల్వే గేటును ఓ వాహనం ఢీకొనడంతో మరమ్మత్తులకు గురయింది. తిరుపతి నుంచి గుంతకల్లు వెళ్లే రైలుకోసం శుక్రవారం రాత్రి ఇక్కడి గేటు మూశారు. వాహనం గేటు స్తంబాన్ని ఢీ కొనడంతో దెబ్బతింది. ఈ మార్గంలో అరగంట పాటు ట్రాఫిక్ స్థంభించింది. రైల్వే సిబ్బంది గేటుకు మరమ్మతులు చేశారు.

ఆర్‌సీపురం వ్యవసాధికారిగా మమత



రామచంద్రాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా మమత శుక్రవారం గంగిరెడ్డిపల్లి ఎన్టీఆర్ రైతు సేవా కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న స్రవంతి అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ రైతులకు త్వరలో సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు అందజేస్తామన్నారు. సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు మమతకు అభినందలు తెలిపారు.

ఇసుకాసురుల దాడిలో బీజేపీ నాయకుడికి గాయాలు


నరేష్‌కుమార్‌నాయుడు

చంద్రగిరి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినదిలో ఇసుక అక్రమ రవాణాను అడుకున్నందుకు తనపై కొందరు దాడి చేశారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు నాగయ్యగారిపల్లె వద్ద స్వర్ణముఖినదిలో ఇసుక అక్రమ రవాణాను నరేష్‌కుమార్‌నాయుడు గురువారం రాత్రి గుర్తించి అడ్డుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్వగ్రామం నుంచి చంద్రగిరికి వస్తున్న ఆయనపై ఇసుక అక్రమ రవాణా బాధ్యులు అడ్డగించి దాడికి పాల్పడ్డారు. నరేష్‌కుమార్‌నాయుడుకి గాయాలయ్యాయి. పోలీసులు కేసు విచారిస్తున్నారు. నదిలో ఇసుక అక్రమ రవాణాను రెవెన్యూ అధికారులు, పోలీసులు అడ్డుకోకపోతే మరిన్ని గొడవలు జరిగే ప్రమాదముంది.

కార్యదర్శి బదిలీపై నిరసన


సచివాలయం వద్ద గ్రామస్తులు,కార్మికుల నిరసన

తిరుపతిరూరల్, మే13(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును బదిలీ చేయొద్దని గ్రామస్తులు, పంచాయతీ కార్మికులు శుక్రవారం ప్లకార్డులతో సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రిటైర్మెంటుకు ఏడాది మాత్రమే ఉండగా నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయడం బాధాకరమన్నారు. ఆయన విశేషసేవలందిస్తూ ప్రజల మన్ననలందుకుంటున్నారన్నారు. సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ బుజ్జమ్మ, జెడ్పీటీసీ రత్నమ్మ, మాజీ సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

రేణిగుంట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పనిలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఓ యువకుడి నిండు ప్రాణం పోయింది. ఈ ఘటన తారక రామానగర్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... బెంగళూరుకు చెందిన కాజా 20 టైల్స్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితులతో కలిసి తారకరామానగర్‌లోని ఓ ఇంటికి టైల్స్ వేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. గురువారం ఇంట్లో పని చేసి టైల్స్ కట్ చేసే యంత్రాన్ని ఆపకుండా వదిలేశాడు. రాత్రి పడిన వర్షానికి గచ్చుపై నీరు చేరింది. అయితే రాత్రి కాజా ఇంటి నుంచి వెలుపలికి వచ్చే వచ్చే క్రమంలో ఇనప గేటు తెరుస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. గుర్తించిన స్నేహితులు విద్యుత్ సరఫరా నిలిపివేసి కాజాను సమీపంలోనరి అమర హాస్పిటల్లో చేర్చారు. అక్కడ చికిత్స ఫలించక మృతి చెందాడు.

ప్రాణం తీసిన ఈత సరదా


విజయకుమార్ మృతదేహం

కేవీబీపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజూరులో విజయకుమార్(25) ఈత కోసం వెళ్లి బావిలో మునిగి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు... శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో విజయకుమార్ ఈతకని ఊరి బయట ఉన్న బావిలోకి దిగాడు. ఈత రాక మునిగి పోయాడని చెప్పారు. విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే ఆదిమూలం అంజూరు చేరుకుని విజయకుమార్ మృతదేహానికి నివాళులర్పించి తల్లిదండ్రులను ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే తిరుగు ప్రయాణంలో కేవీబీపురం కొత్తకాలనీలో డయేరియాతో మృతి చెందిన శిరీష(17)కు నివాళులర్పించారు.

కబ్జా చేసినా కళ్లప్పగించి చూస్తారా?


ఆక్రమణకు గురైన పాండరాజుకుంట

రామచంద్రాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శతాబ్దాల నాటి పాండవరాజులకుంటపై ఆక్రమణదారుల కన్నుపడింది. పార్వతీపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇప్పటికే కొంతమేర ఆక్రమించి చదును చేశారు. నెత్తకుప్పం రెవెన్యూ పార్వతీపురం గ్రామం లెక్కదాఖల సర్వే నెంబరు 188లో వాగు పొరంబోకు సమీపాన సుమారు రెండెకరాల పాండవరాజుల కుంట ఉంది. దీనిని గ్రామానికి చెందిన సోమశేఖర్, వెంకటముని కుంటలోకి కొంతమేర మట్టి తరలించి పూడ్చేశారు. అక్కడ రెండు పశువుల కొట్టాలను ఏర్పాటుచేశారు. ఆక్రమిత స్థలానికి ఇనుప కంచె ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న వీఆర్వో, వీఆర్ఏ తొలగించడానికి వెళ్లగా ఇదే పంచాయతీకి చెందిన ఓ ముఖ్యనాయకుడు అడ్డుకున్నాడు. దీంతో గ్రామానికి చెందిన నాదెండ్ల రాజశేఖర్‌నాయుడు రెవెన్యూ అధికారుల దృష్టికి ఆక్రమణ విషయాన్ని తీసుకెళ్లాడు. అయితే ఆక్రమణదారులకు టీడీపీ నాయకుల అండ ఉన్నట్లు తెలిసింది. చారిత్రాత్మక నేపథ్యమున్న పాండవ రాజుకుంటను యథాస్థితికి తీసుకురాకపోతే ఆందోళన చేస్తామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.ఆక్రమణపై సర్వే చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు.

బంగారు తిరుచ్చిపై సిరుల తల్లి సాక్షాత్కారం



తిరుచానూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారు శుక్రవారం బంగారు తిరుచ్చిపై కొలువుదీరి భక్తులకు సాక్షాత్కరించారు.. ఉదయం కల్యాణోత్సవం, ఊంజల్ సేవ జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తికి తిరుమంజనం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన పద్మావతి దేవి బంగారు తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు శ్రీవారి ఆలయాన్ని సందర్శించిన చైర్మన్


అన్నప్రసాదం వడ్డిస్తున్న బీఆర్ నాయుడు

తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): బెంగుళూరులోని వయ్యాలికావాలిలో ఉన్న టీటీడీ శ్రీవారి ఆలయాన్ని టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు శుక్రవారం సందర్శించారు. ఆలయంలో పూజా విధానాలు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తర్వాత అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

మిశ్రమ సాగుపై రైతులకు అవగాహన

తిరుపతి రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): అడపారెడ్డిపల్లెలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవర్సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మిశ్రమ పంట విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కషాయాలు,జీవామృతం, ఘనామృతం తయారీ గురించి వివరించారు. రసాయన ఎరువుల సాగుతో కలిగే నష్టాలు, ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను సోదాహరించారు. వెరైటీ తోటలు, ఏటీఎం ఏగ్రేడ్ మోడల్స్‌ని వివరించారు. అరటి మొక్కలను పంపిణీ చేశారు. యూనిట్ ఇన్‌చార్జి అయ్యప్పనాయుడు, మెంటార్ మిథున్‌రెడ్డి, ఐసీఆర్‌పీ తరణి రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మజాతర

తిరుపతి రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): చిగురువాడలో శుక్రవారం ముత్యాలమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి దర్శన ఏర్పాట్లు కల్పించారు. మహిళలు అంబలి పోసి మొక్కుచెల్లించారు.

పోలీసులమని బెదిరించి..

● సైబర్ నేరగాళ్ల మోసానికి రూ.32 లక్షలు పోగొట్టుకున్న రిటైర్డు ఉద్యోగి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13(ఆంధ్రజ్యోతి): తాము సీబీఐ పోలీసులం.. బెంగుళూరు పోలీసులమని చెప్పి తిరుపతికి చెందిన ఒక రిటైర్డు ఉద్యోగిని బెదిరించి రూ.32 లక్షలను సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తిరుపతి నగరం రాఘవేంద్రనగర్‌లోని వెంకటరమణబాబు ఇటీవల పదవీ విరమణ చేశారు. కొందరు దుండగులు ఈయనకు 76090 66722, 90589 43522 నెంబర్ల నుంచి వాట్సాప్ కాల్ చేశారు. తాము సీబీఐ పోలీసులమని చెప్పి మొదట పరిచయం చేసుకున్నారు. నీ భార్య లక్ష్మీకుమారి కొంత కాలంగా మానవ అక్రమ రవాణా వంటి కేసుల్లో వుందని, డిజిటల్ అరెస్టులో వున్నారని చెప్పి భయాందోళనకు గురిచేశారు. దీనికోసం కేసులు వద్దనుకున్నా, కేసులు రెఫర్ చేయాలన్నా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి భయపడిన ఆయన మూడు సార్లు తమ బ్యాంకు అకౌంట్ల నుంచి రూ.32 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీనిపై మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ కేసు నమోదు చేశారు.

సకాలంలో రుణాలు మంజూరు చేయాలి


వార్షిక ప్రణాళిక బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం స్వయం సహాయక సంఘాలు, విద్యా రుణాలు సకాలంలో మంజూరు చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పలు విశ్వవిద్యాలయాలున్నాయని, విద్యకు సంబంధించిన రుణాల విషయంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. రుణాల మంజూరులో పలు ప్రైవేటు బ్యాంకులు వెనుకబడి ఉన్నాయని, జాప్యం తగదని సూచించారు. వర్షాలు అధికంగా పడే అవకాశముందున కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ఎల్డీఎం గిరిధర్, బ్యాంకు అధికారులు సామంచి శర్మ, నాబార్డు డీడీఎం సునీల్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, మెప్మా పీడీ రవీంద్ర, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రేపు అండర్ 14, 16 బాలుర క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేషన్(సీడీసీఏ) ఆధ్వర్యంలో ఆదివారం అండర్ 14, 16 బాలుర క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె డివిజన్ వాల్మీకిపురంలో జీవీఎస్‌సీఎస్ క్రీడామైదానం, తిరుపతి కరకంబాడీ రోడ్డులోని సీవీ క్రికెట్ అకాడమీ, చిత్తూరులోని పోలీస్‌గ్రౌండ్‌లకు ఉదయం 9 గంటలకు అండర్ 14, మధ్యాహ్నం 2 గంటలకు అండర్ 16 క్రీడాకారులు హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

తెల్ల దుస్తులు, సొంత క్రీడా సామగ్రి, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9000214966, 8886185559లను సంప్రదించాలని కోరారు.

చర్లపల్లి-తిరుపతి మధ్య 26 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : చర్లపల్లి-తిరుపతి మధ్య 26 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఇందులో 16 డోన్, కడప మీదుగా, 10 ఖాజీపేట, విజయవాడ మీదుగా నడపనున్నట్లు వివరించారు. ఇవి జూలై 2 నుంచి 31వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు.● చర్లపల్లిలో ప్రత్యేక రైలు(07251) జూలై 2 నుంచి 31వ తేదీ వరకు ప్రతి బుధవారమూ బయలుదేరుతుందని తెలిపారు. చర్లపల్లి, జనగాం, ఖాజీపేట, వరంగల్, నెక్కొండ, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట మీదుగా తిరుపతికి మరుసటి రోజు చేరుకుంటుందని వివరించారు. ప్రతి గురువారమూ ప్రత్యేక రైలు(0752) తిరుపతిలో బయలుదేరి వచ్చిన మార్గంలో తిరిగి చర్లపలికి మరుసటి రోజు చేరుకుంటుందని పేర్కొన్నారు. ● చర్లపల్లిలో ప్రత్యేక రైలు(07017) జూలై 4 నుంచి 28వ తేదీ వరకు ప్రతి శుక్ర, ఆదివారాల్లో జయలుదేరి మల్కాజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చెర్ల, మహబూబ్‌నగర్, వనస్పతి రోడ్డు, గద్వాల్, కర్నూల్‌సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతికి మరుసటి రోజు చేరుకుంటాయని తెలిపారు. ప్రత్యేక రైలు(07018) సోమ, శనివారాల్లో తిరుపతిలో బయలుదేరి వచ్చిన మార్గంలోనే రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు. 1ఏసీ, 2ఏసీ, 3ఏసీ, స్లీపర్ క్లాసులతోపాటు సాధారణ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

యోగాంధ్ర ర్యాలీని విజయవంతం చేద్దాం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించే యోగాంధ్ర ర్యాలీల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా ర్యాలీలు, యోగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

17న శ్రీకాళహస్తి, 18 తిరుపతి, 19న సూళ్లూరుపేట నియోజకవర్గం బీవీపాళెంలో యోగాంధ్ర కార్యక్రమాలు ఉంటాయని, జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి సమన్వయం చేయాలని సూచించారు.

మహిళలకు జగన్ క్షమాపణ చెప్పాలి

మాజీ సీఎం తీరుపై టీడీపీ నేతల నిరసన



నిరసనలో పాల్గొన్న టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ తదితరులు- మానవహారం నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

తిరుపతి, జూన్13(ఆంధ్రజ్యోతి): సాక్షి టీవీ చర్చలో అమరావతి ప్రాంత మహిళలపై చేసిన దిగజారుడు వ్యాఖ్యలను మాజీ సీఎం జగన్ ఖండించకపోగా తలబిరుసుగా మాట్లాడుతున్నారంటూ తెలుగు మహిళలు నిరసించారు. శనివారం తిరుపతి ఎమ్మార్ పల్లి సర్కిల్లో వీరు పెద్దఎత్తున మానహారం నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీజీబీసీ ఛైర్మన్, నియోజకవర్గ ఇంచార్జి సుగుణమ్మ ఆధ్వర్యం వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లినీచెల్లినీ గెంటేసిన వ్యక్తికి మహిళల ఆత్మగౌరవం గురించి ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు తలదించుకునేలా మహిళలపై జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసి ఖండించకుండా క్షమాపణలు చెప్పలేదన్నారు. సాక్షి ఛానెల్‌లో నిర్వహించిన అసహ్యకరమైన చర్చను సుప్రీంకోర్టు సమర్థించలేదని గుర్తు చేశారు. తలబిరుసు తగ్గించుకొని జగన్ రాష్ట్ర మహిళలకు క్షమాపణలు చెప్పాలన్నారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ , డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, కొట్టే హేమంత్ రాయల్, కార్పొరేటర్ అన్నా అనిత, రేవతి, భారతి, సుజాతమ్మ, యశోదమ్మ, గంగులయ్య, మధులు పాల్గొన్నారు.

నేడు అడిగోపుల పురస్కారాల ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కవి అడిగోపుల వెంకటరత్నం పురస్కారాలను శనివారం ప్రదానం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని చేపడతారు. సాహిత్యవేత్త రావెల సాంబశివరావు, పరిశోధక విద్యార్థి జి.రమేష్‌బాబుకు పురస్కారం అందజేస్తారు. పలువురు సాహిత్య ప్రముఖులు పాల్గొంటారని వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున తెలిపారు.

విమాన ప్రమాద మృతులకు సంతాపం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు అఖిల భారత శిక్షక్ మహాసంఘ్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. ఈ ఘటన బాధాకరమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వైవీ రామిరెడ్డి, బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరారు. కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

రేబిస్ రహిత ఏపీగా మార్చాల్సింది పశువైద్యులే

వెటర్నరీ వర్సిటీ వీసీ డాక్టర్ రమణ



తిరుపతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రేబీస్ రహిత ఏపీగా మార్చేందుకు ప్రతి పశు వైద్యుడూ కృషి చేయాలని పశువైద్య విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జేవీ రమణ కోరారు. అనిమల్ కేర్ ల్యాండ్ ఆధ్వర్యంలో వరల్డ్‌వైడ్ వెటర్నరీ సర్వీసెస్ సహకారంతో శునకాల జనన నియంత్రణ శస్త్రచికిత్స విధానాలపై రెండు వారాల శిక్షణా కార్యక్రమం తొలిబ్యాచ్ ముగింపు సమావేశం శుక్రవారం తూకివాకం వద్ద జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ భారత జంతు సంక్షేమ సంస్థ నిర్దేశించిన ప్రోటోకాల్ ప్రకారం శునకాల శస్త్రచికిత్స విధానాలను పశువైద్యులకు నేర్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఔరంగాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు డాక్టర్ యుగంధర్ నాయుడు, డాక్టర్ నవీన్, తిరుపతి నగరపాలక సంస్థ వెటర్నరీ అధికారి డాక్టర్ నాగేంద్ర రెడ్డి, అనిమల్ కేర్ ల్యాండ్ డాక్టర్ యజ్ఞ వాల్క్యులు పాల్గొన్నారు.

నిషేధిత హారన్ల తొలగింపు



హారన్లు తొలగించిన సుమో, జీపు డ్రైవర్లు

తిరుపతి (నేరవిభాగం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జీపులు, సుమోలు యజమానులు, డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిషేధిత హారన్లు తొలగించారు. సంఘం నాయకులు విష్ణునివాసం వద్ద ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆధ్వర్యంలో 50 వాహనాలకు నిషేధిత హారన్లు తొలగించారు. కొన్ని రోజులుగా వివిధ ప్రదేశాల్లోని భక్తుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకుని నిషేధిత హారన్లపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఇంకా ఎవరైనా అలాంటి హారన్లు కలిగి ఉంటే తొలగించి పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు.

పొన్నా కృష్ణమూర్తికి సన్మానం



పొన్నా కృష్ణమూర్తిని సన్మానిస్తున్న గుండాల గోపీనాథరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ పొన్నా కృష్ణమూర్తిని రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి సన్మానించారు. తిరుపతిలోని అన్నమాచార్య కళా మందిరంలో 'ఉపనిషత్తుల సందేశం'పై పొన్నా కృష్ణమూర్తి తన ప్రసంగంతో అందరినీ ఆకట్టుకున్నారు. టీటీడీ - గీతా ప్రచార సమితి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. 12 గంటల పాటు నిర్విరామంగా ప్రసంగించారు. తైత్తరీయ, మాండుక్య, ప్రశ్న, కేన, ఐతరేయ, కఠోపనిషత్తుల్లోని సందేశంపై ప్రసంగం సాగింది. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర నాయుడు, సుబ్రమణ్యం యాదవ్, సుబ్రమణ్యంరెడ్డి, మల్లారపు రవి, నాగేశ్వరరావు, తిరుమలయ్య, కోకిల తదితరులు పాల్గొన్నారు.

పైపుల దుకాణంలో అగ్ని ప్రమాదం

రూ.3 లక్షల ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి-రేణిగుంట రోడ్డులోని ఒక పైపుల దుకాణంలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. రూ.3 లక్షల మేర ఆస్తినష్టం జరిగింది. తిరుపతికి చెందిన రామలింగేశ్వరరెడ్డి రేణిగుంట రోడ్డులో ఎస్ఆర్ ట్రేడర్స్ పేరుతో పైపులు, ఫ్యాన్లు, ఎలక్ట్రికల్ పరికరాలు, ఇతర వస్తువుల దుకాణం పెట్టుకున్నారు. శుక్రవారం ఉదయం దేవుడి ఫొటోలకు పూజచేసి, దీపం వెలిగించారు. దీపం నుంచి ఎక్కువ మంట రావడంతో గాలికి పక్కనే ఉన్న ఫర్నీచర్‌కు అంటుకున్నాయి. ఈ విషయాన్ని యజమాని గమనించకపోవడంతో మంటలు పెద్దగా మారాయి. దాదాపు 80 శాతం ఫర్నీచర్ కాలిపోయింది. రామలింగేశ్వర్‌రెడ్డి సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీనిపై కేసు నమోదు చేశారు.

విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(ఆటోనగర్), జూన్13 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి టౌన్ సబ్ డివిజన్ డీఈఈ జయప్రకాష్ కోరారు. అదనపు క్రమబద్ధీకరణ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి 50 శాతం రాయితీ కల్పించిందని వెల్లడించారు. దీన్ని పొందాలంటే ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటనారాయణ, నాగవర్ధన

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కోఆపరేటివ్ అధికారిగా నాగవర్ధన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి శశిధర్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ కూడా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో విద్యుత్ ఫీడర్లు, లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ విన్నకోటి చంద్రశేఖరరావు తెలిపారు. మధురానగర్, కొర్లగుంట, అశోక్‌నగర్, అబ్బన్న కాలనీ, తుడ ఆఫీసు రోడ్డు, తాతయ్యగుంట, ఎంజీఆర్ కాలనీ, మునిరెడ్డినగర్, సీతమ్మ నగర్, రాజీవ్‌నగర్, గాలివీధి, అనంతవీధి, మంచాలవీధి, కేబీ లేఅవుట్, ఇర్లానగర్, వరదరాజనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, మధురానగర్, రవీంద్రనగర్, చింతలచేను, సంజయ్‌గాంధీ కాలనీ, మారుతీనగర్, సుబ్బారెడ్డినగర్, సుభాష్‌నగర్, లీలామహల్ సర్కిల్, డీబీఆర్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్మశాన స్థలం ఆక్రమణకు చెక్

నిర్మాణాలను నేలమట్టం చేసిన రెవెన్యూ అధికారులు



నేలమట్టం చేసిన అధికారులు



శ్మశానంలో నిర్మించిన గదులు

తిరుపతి అర్బన్/జీవకోన, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నగర నడిబొడ్డున కోట్ల రూపాయల విలువైన శ్మశాన స్థలాన్ని కబ్జాదారులు దర్జాగా ఆక్రమించారు. చదును చేసి, ఐదు గదులు కూడా నిర్మించారు. దానికి రెవెన్యూ అధికారులు చెక్ పెట్టారు. అన్నమయ్య మార్గానికి అత్యంత సమీపం కొత్తపల్లి గ్రామ లెక్కదాఖల సర్వే నెంబర్ 155లో 84సెంట్ల విస్తీర్ణంలో శ్మశానవాటిక ఉంది. ఇందులో కొంతభాగం శ్మశానానికి ఉపయోగిస్తున్నారు. మిగిలిన భాగం ఖాళీగా ఉండడంతో ముళ్లపొదలు కమ్ముకుపోయాయి. దీనిపై కబ్జాదారుల కన్నుపడింది. కొంతకాలంగా ఆ ప్రాంతాన్ని శుభ్రం చేస్తుంటే రెవెన్యూ అధికారులు అడ్డుకుని హెచ్చరించారు. అయినా లెక్కచేయకుండా గురువారం పగలు, రాత్రి వరుసగా ఐదు గదులు నిర్మించేశారు. మరిన్ని గదుల ఏర్పాటుకు మెటీరియల్ నిల్వ చేశారు. విషయం తెలుసుకున్న అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి నిర్మాణాలను అడ్డుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్స్‌కవేటర్‌తో శ్మశానానికి చేరుకున్న మండల సర్వేయర్ జగదీష్, వీఆర్వోలు ప్రసాద్, దీనాకుమారి, స్వర్ణ అక్రమంగా నిర్మించిన గదులను పూర్తిగా నేలమట్టం చేశారు. ఆ సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకునే ప్రయత్నం చేసినా పట్టించుకోకుండా పని పూర్తి చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదని, చట్టపరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.



నగరంలో మోస్తరు వర్షం

తిరుపతి అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వాహనదారులు, పాదచారులు తడిసిముద్దయ్యారు.రోడ్లపై వర్షపునీరు జోరుగా ప్రవహించింది. విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఇళ్లకు చేరుకునే క్రమంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. బస్టాండులో ప్రయాణికులు కూడా తడిసిపోయారు. వర్షం ఆగిన తరువాత కూడా వాతావరణంలో ఎలాంటి మార్పు లేదు. ప్రజలకు ఉక్కపోత తప్పలేదు.

నిరాహార దీక్షను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న చిరు వ్యాపారుల సంఘ నేతలు

తిరుపతి(వైద్యం), జూన్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని ఈనెల 15న టీటీడీ పరిపాలనా భవన ముందు సీఐటీయూ అనుబంధమైన చిరు వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక నిరాహార దీక్షను జయప్రదం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు చిట్టిబాబు కోరారు. సంఘ నేతలతో కలిసి ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ శ్రీవారిమెట్టు మార్గంలో 25 ఏళ్లగా 30 కుటుంబాల వారు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. గత ఏడాది చిన్నారిపై పులి దాడి చేయడంతో శ్రీవారిమెట్టు మార్గంలోని చిరు వ్యాపారులను తొలగించారన్నారు. 298 రోజులుగా టీటీడీ పరిపాలనా భవనం ముందు న్యాయం కోసం నిరసన వ్యక్తం చేస్తున్నా టీటీడీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి టీటీడీ పరిపాలనా భవనం వద్ద సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి ఆధ్వర్యంలో సామూహిక నిరాహారదీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని సంఘాల నాయకులు మద్దతు తెలపాలని కోరారు.

అపోలోలో చిన్నారులకు ఆధునిక వైద్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేశ్వరి నాయక్

తిరుపతి(వైద్యం), జూన్13(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు అత్యాధునిక వైద్యసేవలు అందించడంలో అపోలో ఆస్పత్రి ప్రథమస్థానంలో ఉందని పిల్లలకు జరిగే శస్త్ర చికిత్సల్లో వంద శాతం విజయం సాధించడమే ఇందుకు నిదర్శమని చెన్నై అపోలో ఆస్పత్రి పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(పీఐసీయూ) విభాగాధిపతి డాక్టర్ రాజేశ్వరి నాయక్ తెలిపారు. లక్ష్మీపురం సర్కిల్లోని అపోలో ఆస్పత్రిలో ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అధునాతన పరిజ్ఞానం, పరికరాలు, అనుభవం కలిగిన వైద్యనిపుణులు అందుబాటులో ఉండడం వల్ల మంచి వైద్య సేవలు అందించగలుగుతున్నామన్నారు. ఆధునిక పరిజ్ఞానం కలిగిన ఐసీయూ, సెంట్రల్ ల్యాబ్‌లు అందుబాటులో ఉండటం వల్ల శస్త్ర చికిత్సల్లో వంద శాతం విజయం సాధిస్తున్నామన్నారు. ఇటీవల తిరుపతికి చెందిన ఇద్దరు చిన్నారులకు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో వైద్యులు రంజని, సుచిత్ర రంజిత్, చిదంబరం, ప్రియవర్ధిని, వసంత్ పాల్గొన్నారు.

34 ఎర్రచందనం దుంగల స్వాధీనం

- నలుగురు స్మగ్లర్ల అరెస్టు



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పాలకొండలు రిజర్వు ఫారెస్టు పరిధిలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 34 ఎర్రచందనం దుంగలతోపాటు రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ కృపానందానికి చెందిన ఆర్ఎస్ఐ కె.అల్లీబాషా బృందం గురువారం కడప జిల్లా అటవీ ప్రాంతం అన్నా సముద్రం ప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. శుక్రవారం ఉదయం పాలకొండలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా కొందరు వ్యక్తులు టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటపడ్డారు. వారిని సమీపించడంతో పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి ఐదుగురు స్మగ్లర్లను పట్టుకోగలిగారు. వారి నుంచి 34 ఎర్రచందనం దుంగలు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. స్మగ్లర్లను, వాహనాలను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాటి విలువ రూ.40 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. స్టేషన్ ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించండి

- మంత్రులకు వినతిపత్రాలు అందించిన కార్పొరేషన్ ప్రతినిధులు



మంత్రి రామనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సదాశివం తదితరులు

తిరుపతి, జూన్13(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం ఆధ్వర్యంలో పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లు మంత్రులను కలిసి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని అమలు చేయాలని కోరారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి నాయీ బ్రాహ్మణుల ఆరాధ్య దైవం ధన్వంతరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను కలిసి నాయీ బ్రాహ్మణులను కులం పేరుతో దూషిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. నాయీ బ్రాహ్మణులకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. నియోజకవర్గాల వారీగా నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు సురవరపు నాగరాజు, మద్దిరాల గంగాధర్, మున్నంగి శివశేషగిరిరావు, లంక రత్నరావు, జి.సత్యనారాయణ, నిడమానూరు రమేష్, పుల్లేటికుర్తి రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

తిరుపతి(నేరవిభాగం) జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాళ్లదాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అబ్బన్న కాలనీకి చెందిన యువకుడు శుక్రవారం మృతిచెందాడు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. కొర్లగుంట అబ్బన్న కాలనీకి చెందిన మున్నాకుమార్ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 3న ఆయన కొర్లగుంటకు చెందిన హరినాయక్, అతని సమీప బంధువు శివమ్మ ఇంటి ముందు రెండుసార్లు తిరిగాడు. ఇంటి ముందు ఎందుకు తిరుగుతున్నావని వారు ప్రశ్నించారు. చిన్నపాటి గొడవైంది. తర్వాత ఎవరికి వారు వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి హరినాయక్ మున్నాకుమార్ ఇంటి వద్దకు వెళ్లి రాళ్లతో దాడి చేశాడు. గాయాలు కావడంతో మున్నాకుమార్‌ను స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బాధితుడి తల్లి ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత



తిరుపతి(నేరవిభాగం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో తప్పిపోయిన బాలికను పోలీసులు శుక్రవారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. తిరుమల వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. మహారాష్ట్ర లాథూర్ జిల్లాకు చెందిన గణేష్ వైద్యనాథ్ కుమార్తె పల్లవి గణేష్ తన పెద్దనాన్నతో కలసి గతనెల 30వ తేదీన తిరుమలకు వచ్చింది. శ్రీవారి దర్శనానంతరం అఖిలాండం వద్ద తప్పిపోయింది. ఈనెల 2వ తేదీన తిరుమల వన్‌టౌన్ స్టేషన్‌లో పెద్దనాన్న ఆమె ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఢిల్లీలో ఉండగా ఆమె వాడుతున్న మొబైల్ నంబరు ఆధారంగా ట్రాక్ చేసి పట్టుకున్నారు. విచారించగా తనకు పెళ్లి వద్దంటే సంబంధాలు చూస్తున్నారని, అందుకే అలిగి వెళ్లిపోయానని చెప్పింది. తిరుమలకు తీసుకొచ్చి ఆమె తండ్రి గణేష్, చిన్నాన్న కిషోర్‌కు అప్పగించారు. తిరుమల పోలీసులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

నేటి నుంచి 'అంకితం నీకే అంకితం' కార్యక్రమం

ఎస్పీ బాలు జయంతి సందర్భంగా సంగీత కచేరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు, పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి సందర్భంగా శనివారం నుంచి తిరుపతి మహతి ఆడిటోరియంలో రెండు రోజుల పాటు ప్రముఖ గాయనీ, గాయకులతో సంగీత కచేరి జరగనుంది. అంకితం నీకే అంకితం పేరుతో తిరుపతి ఫిలిం సొసైటీ చేపట్టిన ఈ కార్యక్రమం శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానుంది. టీటీడీ ఈ కార్యక్రమానికి సహకరిస్తోంది. యువ గాయనీ, గాయకులు బాలసుబ్రమణ్యం పాడిన పాటలను ఆలపిస్తారు. హీరోయిన్, యాంకర్ ఇంద్రజ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శని, ఆదివారాల్లో సాయంత్రం 6 నుంచి 9 గంటల దాకా ఈ కార్యక్రమం సాగనున్నట్లు తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాలరెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు తెలిపారు. బాలు అభిమానులు, సంగీత ప్రియులు హాజరుకావాలని కోరారు.

శ్రీవారి లడ్డూలపై అసత్య ప్రచారం తగదు

తిరుపతి అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదంపై అసత్యప్రచారం మానుకోవాలని టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్లకిరణ్ కోరారు. తెలంగాణ రంగారెడ్డి జిల్లాకు చెందిన నవీన్‌కుమార్ తిరుమల లడ్డూ ప్రసాదంపై సోషల్ మీడియా ద్వారా చేస్తున్న దుష్ప్రచారాన్ని టీటీడీ ఉద్యోగుల సంఘ నేతలు ఖండించారు. లడ్డూలను పోటు సిబ్బంది చాలా పవిత్రంగా తయారు చేస్తున్నారని, వాటిని తినే సమయంలో నోటికి గాయమైందని ఆరోపించడం దారుణమని పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాఘవేంద్రనగర్‌లో చోరీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రనగర్‌లో చోరీ జరిగింది. నగలు అపహరణకు గురయ్యాయి. ఇక్కడ కాపురముంటున్న వెంకటరమణబాబు కుటుంబ సమేతంగా రెండు నెలల క్రితం అమెరికాకు వెళ్లారు. గతనెల తిరిగి వచ్చారు. తాళాలు పగులకొట్టి ఉండడంతో ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించాడు. ఇద్దరు వ్యక్తులు లోనికి చొరబడి 50.5 గ్రాముల బంగారు, 500 గ్రాముల వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లినట్లు గుర్తించారు. చుట్టుపక్కల తెలిసిన వారిని వాకబు చేశారు. ఎలాంటి వివరాలూ దొరక్కపోవడంతో శుక్రవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 46 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13(ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 46 మందికి జరిమానా విధిస్తూ శుక్రవారం తిరుపతి అదనపు ప్రత్యేక న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు చెప్పారు. పలుచోట్ల ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న 46 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.10వేలు చొప్పున రూ.4.60 లక్షలు జరిమానా విధించారు.

ముగ్గురిపై హత్యాయత్నం కేసు



చికిత్స పొందుతున్న మణి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13(ఆంధ్రజ్యోతి): జీవకోన క్రాంతినగర్‌లో మద్యం తాగి ఘర్షణ పడడమేగాక మరొకరిని హత్య చేసేందుకు ప్రయత్నించిన ముగ్గురిపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు వివరాల మేరకు.. జీవకోనకు చెందిన మణి గురువారం సాయంత్రం స్థానికంగా ఉన్న ఒక ఆలయం వద్దకెళ్లి మద్యం తాగి అక్కడే పడుకున్నాడు. క్రాంతినగర్‌కు చెందిన అతని స్నేహితులు బి.శివప్రసాద్ రెడ్డి, దిలీప్‌కుమార్, కె.విజయకుమార్‌లు అక్కడికి వెళ్లగా వారితో కలసి మణి మద్యం తాగాడు. మైకంలో ఘర్షణ పడ్డారు. ఆ ముగ్గురు కలిసి మణిపై దాడి చేశారు. గమనించిన స్థానికులు రక్తగాయాలతో పడి ఉన్న మణిని రుయాకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తల్లి వసంత ఫిర్యాదు మేరకు ఎస్ఐ లోకేష్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భూదేవి కాంప్లెక్స్ వద్ద క్యూలైన్లు, షెడ్లు



తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్ లోస్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్లు జారీ చేసే కేంద్రాల వద్ద పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు వసతులు ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ప్రస్తుతం 430 మీటర్లు నిర్మిస్తున్న క్యూలైన్‌ను మరో 150 మీటర్ల మేరకు పెంచనున్నారు. ఎండ, వానలకు ఇబ్బంది లేకుండా 2,400 మంది వేచిఉండేలా రెండు శాశ్విత షెడ్లను నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందువల్ల క్యూలైన్లతో కలిపి 5600 మందికి సౌకర్యం కలుగుతుంది. అలాగే భూదేవి కాంప్లెక్స్ పైఅంతస్థును కూడా టోకెన్ల కోసం వచ్చే భక్తులకు వినియోగించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. శ్రీనివాసంలోనూ శాశ్విత క్యూలైన్ల నిర్మాణం కోసం టీటీడీ ప్రణాళికలు రూపొందిస్తోంది. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇంజినీరింగ్ అధికారుల బృందం టోకెన్ల జారీ కేంద్రాలను పలుమార్లు పరిశీలించాక ఈ ప్రతిపాదన సిద్ధం చేశారు.



భూదేవి కాంప్లెక్స్ వద్ద స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల కోసం వేచిఉన్న భక్తులు

శిలాతోరణం సర్కిల్ దాకా క్యూ

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వద్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.11 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,609

తలనీలాలు సమర్పించినవారు: 33,144



నడకదారిలో భద్రత భేష్!



సేవకుడికి ఫీడ్‌బ్యాక్ ఇస్తున్న సురేష్‌బాబు

తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఏర్పాట్లు అన్నీ చాలా బావున్నాయని నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు చెప్పారు. కాలినడకన తిరుమలకు వచ్చిన ఆయన శుక్రవారం ఉదయం శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, నడకమార్గంలో భక్తుల భద్రత కోసం తీసుకున్న జాగ్రత్తలు బావున్నాయని అన్నారు.ప్రసాదాల రుచి బావుందని చెప్పారు. తిరుమలలో సేవలపై సురేష్‌బాబును ఒక సేవకుడు ఫీడ్‌బ్యాక్ కోరగా ఓపికగా అన్ని ప్రశ్నలకూ సమాధానాలు ఇచ్చారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రభుత్వ హామీల రాజ్యసభ కమిటీ చైర్మన్ తంబిదొరై, సభ్యులు, ఎంపీ పార్థసారధి, రాజస్థాన్ మంత్రులు జవహర్ సింగ్ బేహ్దం, కృష్ణకుమార్ వైష్ణోయ్, సెల్కాన్ ఎండీ గురుస్వామిని నాయుడు ఉన్నారు. దర్శనం అనంతరం రాజస్థాన్ మంత్రులు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారత్ త్వరలోనే ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

శ్రీసిటీ- నాఫ్ ఇండియా పరిశ్రమకు గ్రీన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాఫ్ ఇండియా ప్రతినిధి నాగరాజు కట్టా

శ్రీసిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని నాఫ్ ఇండియా పరిశ్రమకు 'గ్రీన్' (పర్యావరణ హిత సంస్థ) గుర్తింపు దక్కింది. హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఈనెల 12న నిర్వహించిన గ్రీన్‌కో సమ్మిట్‌లో ఈ అవార్డును నాఫ్ ఇండియా పరిశ్రమకు అందజేశారు. 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సులో నికర సున్నా పరివర్తన, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి, ఏఐ తదితర రంగాలకు సంబంధించి అంతర్జాతీయ నిపుణులు, పరిశ్రమల ప్రముఖులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు పాల్గొన్నారు. గ్రీన్ అవార్డును అందుకున్న నాఫ్ ఇండియా పరిశ్రమ యాజమాన్యాన్ని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు.

ఈత సరదాతో ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి



మురళి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సరదా కోసం ఈతకు వెళ్లిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి చెందాడు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లుకు చెందిన పెరిమిడి మురళీకృష్ణ(19) శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ చదువుతున్నాడు. ఇటీవల సెలవులకు ఇంటికి వచ్చాడు. ధనుష్, ప్రశాంత్‌తో కలిసి గురువారం తొట్టంబేడు మండలం సింగమాల వద్ద తెలుగుగంగ కాలువలో ఈత కోసం వెళ్లాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో మురళీకృష్ణ గల్లంతయ్యాడు. విద్యార్థి తండ్రి బాలాజీ ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలించారు. చీకటి పడడంతో వెనుదిరిగారు. శుక్రవారం మురళీకృష్ణ మృతదేహాన్ని తెలుగు గంగ కాలువలో గుర్తించి ఒడ్డుకు తెచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు మ్యాంగోనగర్‌కు మంత్రి అచ్చెన్న

పాకాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువు మ్యాంగోనగర్‌లో శనివారం ఉదయం 11 గంటలకు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పర్యటించనున్నారని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. మామిడి రైతులు, వ్యాపారులతో సమావేశమై మామిడి ధరలు, అమ్మకాలపై సమీక్షిస్తారన్నారు.

డీఎస్‌డీవోగా శశిధర్



కలెక్టర్‌ను కలిసిన నూతన డీఎస్‌డీవో శశిధర్

తిరుపతి(క్రీడలు), జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీవో)గా ఎన్.శశిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. ఇప్పటి వరకున్న సయ్యద్‌సాహెబ్ గత ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందారు. అదనపు బాధ్యతలను చిత్తూరు డీఎస్‌డీవో బాలాజీకి అప్పగించారు. శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు స్పందించి సీనియర్ కోచ్(టెన్నిస్)ఎన్.శశిధర్‌ను డీఎస్‌డీవోగా నియమించాలని ప్రతిపాదించారు. ఈ మేరకు శాప్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం సాయంత్రం శ్రీనివాస క్రీడా సముదాయంలో బాధ్యతలు స్వీకరించారు. క్రీడల అభివృద్ధికి, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అసంపూర్తిగా ఉన్న క్రీడా వేదికలపై దృష్టి పెడతామన్నారు.



- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ఔను..వీరు ఆపద్బాంధవులు

అర్జెంట్‌గా ఓ పాజిటివ్ రక్తం కావాలి.. ఆస్పత్రిలో ఓరోగి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. దాతలు ఈ నంబరుకు సంప్రదించండి.. ఇలాంటి అభ్యర్థనలు ఇటీవల వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో చూస్తున్నాం. వైద్యశాస్త్రం ఇంత అభివృద్ధి చెందాక కూడా రక్తం దొరకదా.. బ్లడ్ బ్యాంకులు ఉంటాయి కదా అని ఎక్కువ మంది భావిస్తుంటారు. ఔను ..బ్లడ్ బ్యాంకులున్నాయి. కానీ ఇందులో నిల్వ ఉండాలంటే దాతలు ముందుకు వస్తేనే సాధ్యమతుందని గ్రహించాలి. రక్తం ఇవ్వడమంటే సాటి మనిషికి ప్రాణం పోయడమని గుర్తించాలి. ఇలా స్పందించేవారిని దైవ స్వరూపులుగానే భావించాలి. ఇదిగో వీరిని చూడండి..అవతలి వ్యక్తితో ఏబంధమూ లేకున్నా మానవత్వంతో కదిలి తరచూ రక్తదానం చేస్తున్నారు. పదుగురికీ స్ఫూర్తిదాతలుగా నిలుస్తున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

ఏటా ఐదుసార్లు ఇవ్వవచ్చు



రక్తదానం ద్వారా ముగ్గురిని కాపాడవచ్చు. ఆరోగ్యంగా ఉన్న వారు ఏడాదిలో ఐదు సార్లు వరకు రక్తదానం చేయవచ్చు. దాని వలన మరింత ఉత్తేజకంగా, ఆరోగ్యంగా ఉంటారు. శరీరంలో నుంచి రక్తం సేకరించేందుకు ఎక్కువ సమయం పట్టదు. నొప్పి కూడా ఉండదు. 18 ఏళ్ల దాటిన ఆరోగ్యవంతులు నిస్సందేహంగా రక్తదానికి ముందుకు రావాలి

- డాక్టర్ హరిత, బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి, రుయాస్పత్రి



ఇప్పటికి 60సార్లు రక్తదానం చేశా..

రోడ్డు ప్రమాదానికి గురైన ప్రాణ మిత్రుడి బంధువొకరు సకాలంలో రక్తం అందక నా కళ్ల ముందే చనిపోయారు. అది చూసి నా మనసు చలించిపోయింది. అప్పటి నుంచి ఏడాదికి రెండు, మూడు సార్లు కాదు ..అవసరమైతే ఎక్కువసార్లు రక్తదానం చేసున్నాను. పుట్టిన రోజుతోపాటు ఇంట్లో ప్రత్యేక దినాల్లోనూ తప్పక రక్తదానం చేస్తాను. ఇప్పటికే 60 సార్లు రక్తదానం చేశాను. నా భార్యకు కూడా కూడా పదిసార్లు రక్తదానం చేసింది.

- అబ్దుల్ కలాం ఆజాద్, తిరుపతి



ప్రాణాలను నిలబెట్టాలనే తపన

ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తం అందకపోతే ఎదురయ్యే కష్టాన్ని స్వానుభవంతో తెలుసుకున్నాను. ఇలాంటి పరిస్థితులు ఎవరికీ రాకూడదని భావించాను. అందుకే నావంతు సాయంగా స్పందిస్తున్నాను. ఇప్పటికే 32 సార్లు రక్తదానం చేశాను. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక రోజంటూ లేదూ. సమయం దొరికినప్పుడల్లా వెళ్లి రక్తదానం చేస్తున్నాను. ఇతరుల ప్రాణాలు నిలబెట్టేందుకు ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను.

- పి.మకరంద్, తిరుపతి

వీలైనప్పుడల్లా రక్తదానం చేస్తాను



రోడ్డు ప్రమాదానికి గురైన వారిని ఆస్పత్రికి సకాలంలో తీసుకువెళ్లినా అవసరమైన రక్తం దొరక్క చనిపోయిన వారిని చాలా మందిని చూశాను. ఆ సమయంలో చేసే చిన్నపాటి రక్తదానం వారి ప్రాణాలను నిలబెడుతుందని తెలుసుకున్నాను. వీలైనప్పుడల్లా రక్తదానం చేస్తుంటాను. మొబైల్ రక్తదాన శిబిరాలు కనిపించినా వెళ్తుంటాను. ఇప్పటి వరకు 30 సార్లు రక్తదానం చేశాను.

-డి.మునిశేఖర్ చౌదరి, ఆర్టీసీ ఉద్యోగి, తిరుమల

కొత్త కణాలు ఉత్పత్తవుతాయి



రక్తదానంతో దుష్ఫలితాలు ఉండవు. దాతల ఎముకల్లో మూలుగ ఉత్తేజితమై కొత్త రక్త కణాలు ఉత్పత్తవుతాయి. ఫలితంగా మరింత ఆరోగ్యవంతులుగా జీవిస్తారు. 18-60 ఏళ్ల లోపు ఆరోగ్యవంతులు రక్తదానం చేయొచ్చు. హెచ్ఐవీ, మలేరియా, కామెర్లు, మధుమేహం, గుండెపోటు, వైరల్ హెపటైటిస్, కాలేయం, మూత్రపిండాల సమస్యలు, గర్భంతో ఉన్నవారు, జన్యు సమస్యలు, మూర్ఛ, మానసిక అనారోగ్యం, గత 3 నెలల్లో శస్త్ర చికిత్సలు, జ్వరం, బరువు తగ్గటం, రెండు వారాల క్రితం కుక్క కాటు బాధితులు లింటి వారు రక్తదానానికి అనర్హులు. ప్రసవం సమయంలో రక్తహీనతతో బాధపడే గర్భిణులకు రక్తం ఎంతో అవసరం. ఇలాంటి సందర్భంలో దాత రెండు ప్రాణాలను కాపాడిన వారవుతారు.

- డాక్టర్ ప్రసన్న రాగూర్, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి

అవసరమని తెలిస్తే స్పందిస్తాను



సకాలంలో రక్తం అందకపోతే విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. రక్తం అవపరమని మెసేజ్‌లు వాట్సాప్, ఫేస్‌బుక్ ఇలా ఏ సామాజిక మాధ్యమంలో చూసినా వెంటనే స్పందిస్తాను. వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటాను. నిజంగా రక్తం అవసరమైతే ఎంత దూరమైనా వెళ్లి రక్తం ఇచ్చి వస్తున్నాను. నాతో పాటు మా అబ్బాయి పుట్టిన రోజున కూడా రక్తదానం చేయడం అలవాటు చేసుకున్నాను. ఇప్పటికే 30 సార్లు రక్తదానం చేశాను.

- ఎం.నందికేశవన్, తిరుమల



'ఫేక్' నాటక పాత్రధారి ఆపరేటర్!

- అతడు దొరికితేనే నకిలీ ఉత్తర్వుల చిక్కుముడి వీడేది

తిరుపతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'ఫేక్' నాటక పాత్రధారి గంగమ్మ ఆలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ పి.సి.నవీన్‌కృష్ణా కుమార్. దీని వెనుక సూత్రధారులు ఎవరనేది తేలాలంటే పరారీలో ఉన్న ఆపరేటర్ దొరకాల్సిందే. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో భజంత్రీలుగా పనిచేస్తున్న జి.శివకుమార్ (నాదస్వరం), పి.వెంకటసుబ్బయ్య, ఆర్.జయరాం (డోలు), పి.అయ్యప్ప (శృతి), పి.రెడ్డెమ్మ (నాదస్వరం)ను గ్రేడ్1గా పదోన్నతి పొందినట్టు ఫేక్ ఉత్తర్వులతో పదోన్నతి కల్పించిన వ్యవహారంపై ఐదుగురిని సస్పెండ్ చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన క్రమంలో 'గంగమ్మకే శఠగోపం' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. పరారైన నవీన్‌ను పట్టుకొచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. అతడ్ని విచారిస్తేనే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని దేవదాయశాఖ అధికారులు అంటున్నారు. కాగా, వైసీపీ హయాంలో జరిగిన నకిలీ ఉత్తర్వుల కథ ఒక్క తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికే పరిమితమైందా? లేదా మిగిలిన దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లోనూ చోటుచేసుకుందా? అన్న అనుమానంతో 'ఆంధ్రజ్యోతి' ఆరాతీసింది. ఆర్జేసీ మల్టీజోన్-2 పరిధిలో 16 జిల్లాలు వస్తాయి. గంగమ్మ ఆలయ ఘటన వెలుగులోకి వచ్చాక ఈ ఆలయాల్లో పదోన్నతి ఉత్తర్వులను ఆర్జేసీ పరిశీలించారు. ఎక్కడా ఫేక్ ఉత్తర్వులు తమ దృష్టికి రాలేదని దేవదాయశాఖ సహాయ కమిషనర్ రామకృష్ణారెడ్డి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. గంగమ్మ ఆలయంలో మాత్రమే బయటపడ్డాయని, పరారీలో ఉన్న ఆపరేటర్‌ను విచారిస్తే అసలు విషయం తెలుస్తుందన్నారు. ఇక, వైసీపీ హయాంలో వెలుగు చూస్తున్న నిధుల దుర్వినియోగం, ఫేక్ ఉత్తర్వులు తదితరాలపై సమగ్ర విచారణ జరపాలని ఆలయ మాజీ ఛైర్మన్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ డిమాండు చేశారు.

రాష్ట్రాభివృద్ధికి అండగా కేంద్రం

- పెండింగ్ ప్రాజెక్టులు, నిధుల విడుదలపై త్వరితగతిన పరిష్కారం
- ప్రభుత్వ హామీల రాజ్యసభ అధ్యయన కమిటీ ఛైర్మన్ తంబిదురై



సమావేశంలో మాట్లాడుతున్న బృందం ఛైర్మన్ తంబి దురై

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, పలు పెండింగ్ ప్రాజెక్టులు, నిధుల విడుదల అంశాలపై రాజ్యసభ ఛైర్మన్‌కు నివేదించి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ హామీల రాజ్యసభ అధ్యయన కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.తంబిదురై అన్నారు. తిరుచానూరులోని తాజ్‌హోటల్‌లో కేంద్ర ప్రభుత్వ హామీలు, వివిధ శాఖలకు సంబంధించి పలు అంశాలపై జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్షించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి నిధుల కొరత ఉందన్నారు. ఏపీకి నిధులు విడుదల, ప్రాజెక్టుల పురోగతికి, జాతీయ రహదారులు తదితర వాటి అభివృద్ధికి అండగా ఉండేందుకు కేంద్రం సుముఖంగా ఉందని, అందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు అహ్మదాబాద్ విమాన ప్రమాద దుర్ఘటనపై తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కమిటీ సభ్యులు బీరేంద్రప్రసాద్ బైశ్య, నీరజ్ డాంగి, బాబుబాబ్ జేసంగ్‌బాయిదేశాయి, గిరిరాజన్, మహ్మమద్ నదిముల్ హక్, డాక్టర్ మేధా విశ్రామ్, కులకర్ణి, ఆదిత్యప్రసాద్, దర్శన్‌సింగ్, లహర్‌సింగ్, సిరోయా, జిగ్నేస్ సోలంకి, జేసీ శుభం బన్సల్, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, బ్యాంకు అధికారులు సత్యనారాయణరాజు, అలోక్ అగర్వాల్, పాండురంగ మితాంతయ, అశోక్ చంద్ర, సునీల్‌కుమార్ చుగ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభలపై తేజోమయుడు





సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతున్న వెంకటేశ్వరుడు

వడమాలపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై ఉత్సవర్లు మాడవీధుల్లో విహరించారు. ఇక, ఉదయం వాహనం తర్వాత వేంకటేశ్వరస్వామి, పద్మావతి, ఆండాళ్ ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం.. సాయంత్రం ఊంజల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, కంకణభట్టార్ తిప్పయ్యఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి రథోత్సవం: శనివారం ఉదయం 9.00-10.30 గంటల మధ్య ఉభయ దేవేరులతో ప్రసన్న వేంకటేశ్వరుడి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

అద్దె చెల్లించలేదని సచివాలయానికి తాళం

సత్యవేడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా అద్దె చెల్లించడం లేదంటూ సత్యవేడు మండలం కన్నావరంలోని సచివాలయానికి భవన యజమాని శుక్రవారం అదనపు తాళం వేశారు. ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది అదనపు తాళాన్ని చూసి భవన యజమానిని సంప్రదించారు. సచివాలయానికి 24 నెలల అద్దె చెల్లిస్తేనే తాళం తీస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయం తెలిసి ఎంపీడీవో తరుణాక్షరెడ్డి, ఏవో త్రివిక్రమరావు గ్రామానికి చేరుకుని భవన యజమాని మణి, సర్పంచ్ బాలకృష్ణతో చర్చించారు. అద్దె బకాయిలను పంచాయతీ నిధుల నుంచి చెల్లించేలా ఏర్పాటు చేశారు. దీంతో భవన యజమాని మణి అందుకు అంగీకరించి కార్యాలయం తెరవడంతో వివాదం సద్దుమణిగింది.

సచివాలయం వెలుపల వేచి ఉన్న సిబ్బంది



తనియాలిలో అనంతపురంవాసి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దొరవారిసత్రం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం తనియాలిలో అనంతపురం జిల్లాకు చెందిన అంజప్పగారి ఈశ్వరప్ప(45) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం మేరకు.... అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లెకు చెందిన అంజప్పగారి ఈశ్వరప్ప డీఎస్సీ పరీక్షలు రాయడానికి వెళుతున్నట్లు చెప్పి రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వచ్చాడు. గురువారం తనియాలి వద్ద పొలాల్లో గొర్రెల కాపరులతో మాట్లాడాడు. తాను అలిగి ఇంటి నుంచి వచ్చేసినట్లు చెప్పాడు. గొర్రెల కాపరుల వద్ద భోజనం చేసిన ఈశ్వరప్ప శుక్రవారం రాత్రి కాళంగి నది ఒడ్డున ఉన్న చెత్త నుంచి సంపద తయారీ షెడ్డులో ఉరేసుకుని మృతి చెందాడు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ అజయ్‌కుమార్ పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడుకి భార్య శ్రీలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తండ్రిపై తనయుడు కత్తితో దాడికి యత్నం

ఇద్దరికి గాయాలు

బాలాయపల్లి, జూన్ 13: తండ్రిపై తనయుడు కత్తితో దాడికి యత్నించిన ఘటనలో ఇద్దరికి గాయాలపాలైన సంఘటన మండలంలోని చిలమ నూరు గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... చిలమనూరు గ్రామానికి చెందిన మోడె హరికృష్ణపై ఆయన కుమారుడు గిరి కత్తితో దాడికి యత్నించాడు. భయభ్రాంతులకు గురైన హరికృష్ణ పక్కనే ఉన్న సుబ్బయ్య ఇంటిలోకి ప్రవేశించి తలదాచుకున్నాడు. తన తండ్రిని దాచిపెట్టారనే కోపంతో సుబ్బయ్య, పోలమ్మపై గిరి దాడి చేశారు. ఈ ఘటనలో సుబ్బయ్యకు స్వల్ప గాయాలు కాగా, పోలమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పోలమ్మను తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలపై విస్తృత ప్రచారం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న కార్పొరేట్‌స్థాయి విద్యపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని సీడీపీవో మునికుమారి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ వర్కర్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మూడేళ్లు నిండిన ప్రతిబిడ్డ విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రీ స్కూల్‌లో సమయపాలన పాటించాలని, నిబంధనలు పాటించిక పోతే సంబంధిత ఇబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం మంజూరు చేసి పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ కవిత, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధవరంలో ఉచిత వైద్య శిబిరం

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్ధవరంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. చిల్లకూరు మండలం వల్లిపేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ దినేష్, డాక్టర్ శివశంకర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరాలు, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. తాగునీటిని ఎలా శుద్ధి చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు భువనేశ్వరి, ఏఎన్‌ఎం నాగమణి, సౌజన్య, తిరుపాలమ్మ, రావమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నాయుడుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ అన్నారు. నాయుడుపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం అంగన్‌వాడీ ప్రాజెక్టు మహాసభలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, మే నెల మొత్తం సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండల కమిటీ అధ్యక్షురాలుగా రూపాదేవి, ప్రధాన కార్యదర్శి నెలవల శ్యామలమ్మ, కోశాధికారి మేరీ ప్రమీల, గౌరవ అధ్యక్షుడు శివకవి ముకుందను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంధ్యారాణి, కళావతి, విజయనిర్మల, జానకమ్మ, ప్రమీల, ఉషా, శాంతి, సింధుజా తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

దక్కిలి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్‌ఐ శివశంకర్ అన్నారు. శుక్రవారం ఆయన జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన పత్రాలు లేకుండా డ్రైవింగ్ చేసినా, మైనర్లకు ద్విచక్రవాహనాలు చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు

నాయుడుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో బోధన జరుగుతోందని నాయుడుపేట ఎస్‌సీజీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ గురవయ్య, రమణరావు అన్నారు. నాయుడుపేటతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పదో తరగతి పాస్ అయిన విద్యార్థుల గృహాలకు వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల చేరాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో లక్షల రూపాయలు ఫీజులు ఉంటాయని, ప్రభుత్వ కళాశాలలో విద్య, పుస్తకాలు, భోజనం పూర్తిగా ఉచితమన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ కళాశాలలో క్వాలిఫైడ్ అధ్యాపకుల ద్వారా నాణ్యమైన బోధన అందిస్తామన్నారు.

రోడ్లపై ఆక్రమణలను తొలగించండి

నాయుడుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధుల్లో రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను, తోపుడు బండ్ల తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడుతూ పట్టణంలో రోడ్లపై బండ్లు, దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు.

వసతి గృహం, పాఠశాలల పరిశీలన

వాకాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అంబేడ్కర్ గురుకులం, ఎస్‌ఏఎల్‌సీఈఎఫ్ పాఠశాల, బీసీ హాస్టల్‌ను తహసీల్దారు రామయ్య శుక్రవారం పరిశీలించారు. పాఠశాలల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చూడాలని ప్రిన్సిపాల్‌ను సూచించారు. బీసీ హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంజివాకలో శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ ప్రారంభించారు. అల్లంపాడు, కొక్కుపాడు, తిమ్మానాయుడుపాళెం పంచాయతీల ప్రజలు ఈ ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైల్లో నుంచి పడి యువకుడి మృతి

తడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ చెన్నకేశవ తెలిపిన వివరాల మేరకు.. తడ, అక్కంపేట ఎగువ రైలు మార్గంలో 76వ కిలో మీటరు వద్ద శుక్రవారం ఉదయం యువకుడు మృతదేహం ఉన్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఈ నెల 9న పాట్నా నుంచి కొయ్యంబత్తూరుకు వెళ్లేందుకు టిక్కెట్ లభించింది. నలుపురంగు జీన్స్ ప్యాంట్, ఎరుపురంగు టీషర్టు ధరించి ఉన్నాడు. రాత్రి సమయంలో ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్‌పీ ఎస్‌ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మురళీ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నీటిగుంటలో పడి వృద్ధుడి మృతి

చిల్లకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లవోలు సమీపంలోని నీటిగుంటలో పడి వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన రామకృష్ణయ్య(65) గురువారం సాయంత్రం గ్రామానికి సమీపంలోని నీటిగుంటలో చేపలు పట్టుకునేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు గుంటలో పడి మృతిచెందాడు. రామకృష్ణయ్య ఇంటికి రాకపోవడంతో శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు గాలించగా నీటిగుంటలో మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18న మండల సమావేశం

వెంకటగిరి టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి అధ్యక్షతన ఈనెల 18న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి తెలిపారు.

ఆటోవాలాల అడ్డా ఆర్టీసీ బస్టాండు

తీవ్ర ఇబ్బందులు పడుతున్న బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు

సూళ్లూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోవాలాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. బస్సులు బయటకు వచ్చేటప్పుడు.. లోపలకు వెళ్లేటప్పుడు కొందరు ఆటోవాలాలు ప్రవర్తించే తీరు అటు ప్రయాణికులకు, ఇటు బస్సు డ్రైవర్లకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. ఆర్టీసీ బస్టాండుతో పాటు ఎదురుగా ఉన్న జీఎన్‌టీ రోడ్డు, మార్కెట్ సెంటర్, షార్ సర్కిల్ ప్రాంతాల్లో ఆటోవాలాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరే సమయంలో ప్రయాణికులు త్వరగా బస్సు ఎక్కే ప్రయత్నం చేస్తుంటారు. ఈ క్రమంలో ఆటోవాలాలు అడ్డుగా ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్టాండ్‌లో ఉన్న ఆర్టీసీ సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదు. ఆటోలు అడ్డదిడ్డంగా ఎక్కడపడితే అక్కడ నిలపడంతో ఇటు ఉత్తరం వైపు, ఇటు దక్షిణవైపు నుంచి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆటోవావాలను నియంత్రించేందుకు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఒక హోంగార్డు డ్యూటీలో నిరంతరం ఉండేవారు. ప్రస్తుతం ఆ వ్యవస్థ లేకపోవడంతో ఆటోవావాలకు ఇష్టారాజ్యమైంది. మార్కెట్ సెంటర్ వద్ద అయితే రోడ్డుకు అడ్డంగా ఆటోలు నిలపడంతో



ఆర్టీసీ బస్టాండులో అడ్డంగా నిలిపి ఉన్న ఆటోలు

బజారు వీధుల్లోకి పనుల నిమిత్తం వెళ్లేవారికి అవస్థలు తప్పడం లేదు. బస్టాండు ఆవరణలో అడ్డదిడ్డంగా ఆటోలు ఉంటున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు ఆటోవాలాలకు నియంత్రించాల్సిన అవసరం ఉంది.

చెరువులా పాఠశాల మైదానం



బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిలచిన వర్షపునీరు

సూళ్లూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానం చిన్నపాటి వర్షమొచ్చినా చెరువును తలపిస్తోంది. మైదానంలో పడిన వర్షపునీరు బయటకు వెళ్లేందుకు వీలులేకపోవడంతో నిల్వచేరుతోంది. పాఠశాలలు పునఃప్రారంభం రోజు గరువారం రాత్రి భారీ వర్షం కురవడంతో పాఠశాల మైదానమంతా నీటితో నిండిపోయింది. దీంతో విద్యార్థులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. మైదానంలో నీరంతా పాఠశాలను ఆనుకొని ఉన్న మురుగు కాలువలోకి వెళ్లే విధంగా ఎత్తు పెంచాల్సిఉంది. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదు. ఇకనైనా సంబంధింత అధికారులు స్పందించి పాఠశాల మైదానంలో వర్షపునీరు నిల్వ చేరకుండా చూడాల్సిన అవసరం ఉంది.

అధ్వానంగా డ్రైనేజీ కాలువలు



చిల్లకూరు వడ్డిపాళెం వద్ద అధ్వానంగా ఉన్న డ్రైనేజీకాలువ

చిల్లకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు వడ్డిపాళెం ప్రాంతంలో డ్రైనేజీ కాలువలు అధ్వానంగా ఉన్నాయి. వడ్డిపాళెం సమీపంలోని ప్రధాన రహదారికి అనుకుని ఉన్న డ్రైనేజీ కాలువ పూర్తిగా ధ్వంసమైంది. మురుగునీరు ముందుకు కదలకపోవడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు, చెబుతున్నారు. అంతేకాకుండా డ్రైనేజీ కాలువ అధ్వానంగా ఉండడంతో ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే సమయంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారమని వాహనదారులు అంటున్నారు. అదేవిధంగా వడ్డిపాళెంలోని ఓ ఏటీఎం ఎదురుగా ఉన్న వీధిలో ఉన్న డ్రైనేజీ కాలువ అధ్వానంగా ఉంది. కాలువలోని మురుగు ముందుకు కదలకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, చిన్నపాటి వర్షం కురిసినా కాలువలోని మురుగు రోడ్డుపై చేరడంతో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు డ్రైనేజీ కాలువలను బాగు చేయాలని కోరుతున్నారు.

14, 16, 19 తేదీల్లో పలు రైళ్ల రద్దు

తడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మధ్య ఈనెల 14(శనివారం), 16(సోమవారం), 19(గురువారం) తేదీల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు తెలిపారు. చెన్నై - గూడూరు మార్గంలో కవర్‌పేట, గుమ్మిడిపూడి స్టేషన్ల మధ్యలో కొద్ది నెలలుగా ఇంజనీరింగ్ సిగ్నల్ వ్యవస్థల మార్పులు వంటి పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 14, 16, 19 తేదీల్లో ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం 3.20 వరకు పనులు చేపడతారు. ఆ సమయంలో పలు రైళ్లను రద్దు చేశారు.

రద్దు చేసిన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50కు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66037
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు సాయంత్రం 6.40 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66038
- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05 గంటలకు, రాత్రి 9.00 గంటలకు బయలుదేరే ఈఎంయే లోకల్ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.10 నిమిషాలకు, 3.10, రాత్రి 9.00 గంటలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.40, 10.30, 11.35, మధ్యాహ్నం 12.40లకు వెళ్లే ఈఎంయూ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు ఉదయం 10.55, మధ్యాహ్నం 1.00 గంటకు, 2.30, 3.15లకు బయలుదేరి వెళ్లే ఈఎంయు లోకల్ రైళ్లను రద్దు చేశారు. మరి కొన్ని రైళ్లు పాక్షికంగా రద్దయ్యాయి.

కొళాయిల్లో కలుషిత నీరు

సూళ్లూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో పలు ప్రాంతాల్లోని కొళాయిల్లో కలుషిత తాగునీరు వస్తోంది. పిండిపాలెం వద్దనున్న కోటపోలూరు చెరువులోని సమ్మర్ స్టోరేజ్, తల్లంపాడు చెరువులో ఉన్న బోరు పాయింట్ల ద్వారా పట్టణానికి తాగునీరు అందిస్తున్నారు. మూడు రోజుల నుంచి పట్టణంలోని పొట్టి శ్రీరాముల వీధి, పార్కువీధి, వీర్లచావడం, గాండ్లవీధి ప్రాంతాల్లోని కొళాయిల్లో దుర్వాసనతో కూడిన కలుషిత నీరు వస్తోంది. చాలాచోట్ల పైపులైన్ పగిలి తాగునీటితో మురుగు కలడం వల్లే కలుషితంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై డీఈ శ్రీనివాసరావుని వివరణ కోరగా కలుషిత తాగునీరు వస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని, పైపులైన్లను తనిఖీ చేయించి ఎక్కడైన లీకేజీలు ఉంటే సరి చేస్తామన్నారు.

సూర్యప్రభ వాహనంపై వెంకన్న



గూడూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై అలంకరించి గ్రామోత్సవం జరిపారు. అలాగే లక్ష్మీసంవాదం, ముసుగులసేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ ఛైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ పాల్గొన్నారు.

ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు

గూడూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పవరప్పాడు గ్రామంలో శుక్రవారం తిరుపతి వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(సిమ్స్) ఆధ్వర్యంలో పింక్‌బస్సు ద్వారా ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని నివారించేందుకు రాష్ట్రప్రభుత్వం సిమ్స్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సల్మా, లీలాకృష్ణ, పద్మావతి, చైతన్యభాను తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ పిలుస్తోంది'

తడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జ్యోతి కిరణ్, సూపర్ వైజర్లు లక్ష్మి, నారాయణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సూళ్లూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట స్టేట్ బ్యాంక్‌లో శుక్రవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఎస్‌బీఐ స్థాపించి 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేసినట్లు మేనేజర్ కసిరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, స్థానికులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అంబటి పృధ్వీరాజ్, ఏవో సాయిబాబ, సిబ్బంది పాల్గొన్నారు.

సాయి ఆలయంలో సామూహిక పూజలు

వాకాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వాకాడు సాయిబాబా ఆలయంలో శుక్రవారం షిరిడీసాయి అనుబంధ సేవాసంస్థ ఆధ్వర్యంలో సామూహిక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గంగిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆలయ ధర్మకర్తలు విజయలక్ష్మి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దారి విషయమై రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

పెళ్లకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామంలో దారి విషయమై వివాదనం నెలకొనడంతో శుక్రవారం సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రామ సమీపంలో నెలకొల్పిన స్టీల్ పరిశ్రమకు సంబంధించిన వాహనం గ్రామంలోని ప్రధాన రహదారిలో వెళ్తూ ప్రమాదవశాత్తు ఓ బాలుడిని ఢీకొంది. బాలుడు మృతిచెందడంతో పరిశ్రమ వాహనాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం గ్రామానికి వెలుపల ప్రైవేట్ భూముల్లో తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేసుకుంది. ఆ భూములకు పదేళ్లుగా నష్టపరిహారం చెల్లించలేదని బాధితులు రోడ్డుకు అడ్డంగా గోడను నిర్మించి రాకపోకలు నిలివేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో కిరణ్మయి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకనాధ్‌రెడ్డి, వీఆర్వో మోబీనా పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వండి

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తమకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సూరిశెట్టిపాళెం గిరిజనులు శుక్రవారం తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. కొక్కుపాడు పంచాయతీ పరిధిలోని సూరిశెట్టిపాళెం గిరిజన కాలనీలో ఒక్కొక్క ఇంట్లో రెండేసి కుటుంబాలు ఉంటున్నాయన్నారు. ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని గిరిజనులు కోరారు.

సెక్టార్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సెక్టార్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. సీఐటీయూ నేత బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కోట ప్రాజెక్టు కమిటీని ఎన్నుకున్నారు. అంగన్‌వాడీ అసోసియేషన్ కోట ప్రాజెక్టు అధ్యక్షురాలుగా విజయలక్ష్మి, కార్యదర్శిగా పద్మలీల, కోశాధికారిగా కోటేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా జిల్లా విభాగానికి కార్యదర్శిగా వాణిశ్రీ, కోశాధికారిగా రాజేశ్వరి, అధ్యక్షురాలిగా పద్మలీలతో పాటు 9మంది సెక్టార్ లీడర్లను ఎన్నుకున్నారు.

కోటమ్మకు మల్లెల అలంకారం

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు శుక్రవారం మల్లెల అలంకారం చేశారు. ఆలయ పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి పలు అభిషేకాలు చేసి మల్లెపూలు, కనకాంబరాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

చిల్లకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పారిచెర్లవారిపాళెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనసూయ అన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పారిచెర్లవారిపాళెం గ్రామానికి చెందిన బల్లి రామచంద్రారెడ్డి సహకారంతో నగదు ప్రోత్సాహకాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులు నవ్యశ్రీకి రూ.5వేలు, తన్వికి రూ.3వేలు, లోహిత్‌కు రూ.2వేలు నగదు బహుమతులు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో షకీలా, చంద్రశేఖర్, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, విద్యుల్లత, మధుసూదన్‌రావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నగదు బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జలీల్‌అహ్మద్ తదితరులు

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ సీఎం చంద్రబాబునాయుడు ప్రజల మన్ననలు పొందుతున్నారని టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం కోటలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి జలీల్ అహ్మద్‌తో పాటు తెలుగు మహిళలు, నాయకులు, పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధు యాదవ్, ఎంపీటీసీలు దారా సురేష్‌బాబు, షంషుద్దీన్, శ్రీధర్‌రెడ్డి, కోటేశ్వరరావు, నౌషాద్, శ్రీనివాసులు, పోలమ్మ, నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు, పక్కన డీఈఈ శేఖర్, ఏఈలు పూర్ణిమ, మోహిని, మురళి తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని నాయుడుపేట విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యఘర్ పథకం కింద బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నాయన్నారు. విద్యుత్తు బిల్లుల భారం తగ్గుతుందని, దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఈఈ శేఖర్, ఏఈలు పూర్ణిమ, మోహిని, మురళి, జగదీష్, విద్యుత్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయ ప్రహరీ ప్రారంభం

ఓజిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండలో వెలసిన చెంగాళమ్మ ఆలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా నిర్మించిన ప్రహరీని శుక్రవారం సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. చెంగాళమ్మ ఆలయం జీర్ణావస్థలో ఉండగా గ్రామానికి చెందిన కృష్ణయ్య పునరుద్ధరించారు. ఇందులో భాగంగా ఆలయానికి ప్రహరీ నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దారా అంకయ్య, శ్రీనివాసులరెడ్డి, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట ఏడీఏగా నాగార్జునసాగర్

నాయుడుపేట టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట వ్యవసాయశాఖ ఏడీఏగా నాగార్జునసాగర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వెంకటగిరిలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

రేణిగుంట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పనిలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఓ యువకుడి నిండు ప్రాణం పోయింది. ఈ ఘటన తారక రామానగర్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... బెంగళూరుకు చెందిన కాజా 20 టైల్స్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితులతో కలిసి తారకరామానగర్‌లోని ఓ ఇంటికి టైల్స్ వేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. గురువారం ఇంట్లో పని చేసి టైల్స్ కట్ చేసే యంత్రాన్ని ఆపకుండా వదిలేశాడు. రాత్రి పడిన వర్షానికి గచ్చుపై నీరు చేరింది. అయితే రాత్రి కాజా ఇంటి నుంచి వెలుపలికి వచ్చే వచ్చే క్రమంలో ఇనప గేటు తెరుస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. గుర్తించిన స్నేహితులు విద్యుత్ సరఫరా నిలిపివేసి కాజాను సమీపంలోనరి అమర హాస్పిటల్లో చేర్చారు. అక్కడ చికిత్స ఫలించక మృతి చెందాడు. సమాచారం అందుకున్న కాజా కుంటుంబీకులు తారకరామానగర్‌కు చేరుకుని మృతదేహాన్ని బెంగళూరుకి తీసుకెళ్లిపోయారు.

బాణసంచా పేలుడు: చికిత్స పొందుతూ యువకుడి మృతి

వరదయ్యపాళెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత ఉత్సవాల్లో బాణసంచా పేలుళ్లల్లో యువకుడి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు... మండలంలోని కారి పాకంలో బుధవారం రాత్రి గ్రామదేవత ఉత్సవా లను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాణసంచా పేల్చేక్రమంలో కొంతదూరంలో నిల్వ ఉంచిన టపాసులపై నిప్పురవ్వలు పడి అవి పేలాయి. ఉత్సవాన్ని వీక్షించడానికి వచ్చిన లోకేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. 90 శాతం కాలిపోవడంతో శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా చేనేత కుటుంబానికి చెందిన ఉష, కృష్ణయ్యకు ఒక్కగానొక్క కుమారుడు లోకేష్. చేతికి అంది వచ్చిన కుమారుడు కళ్ల ముందే చనిపోవడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. స్థానికంగా ఓ యవకుడు ఎలాంటి అనుమతులు లేకుండా కొలతకు మించి రసాయనాలు వినియోగించిన బాణసంచాను పేల్చినట్టు తెలుస్తోంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు.

యువకుడిపై దాడి

రేణిగుంట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి చేయడంతో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసారు. హిందూపురంకి చెందిన సోహైల్ తిరుపతి రైల్వేస్టేషన్‌లోని పార్శిల్ కార్యాలయంతో కాంట్రాక్టర్ కార్మికుడు. ఇక్కడే ఎళుమలై అనే వ్యక్తి ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. అయితే సోహైల్‌ను తొలగించి మరో వ్యక్తిని నియమించుకున్నాడు. దీనిపై ఏళుమలైను సోహైల్ ప్రశ్నించాడు. దీంతో ఎళుమలై, కొత్తగా పనిలో చేరిన శేఖర్‌తో కలిసి సోహైల్‌పై విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీంతో సోహైల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ జయచంద్ర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు(65) మృతి చెందింది. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం నారాయణ పురం వద్ద పీఎన్ జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు గుర్తించి శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రాణం తీసిన ఈత సరదా



విజయకుమార్ మృతదేహం

కేవీబీపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజూరులో విజయకుమార్(25) ఈత కోసం వెళ్లి బావిలో మునిగి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు... శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో విజయకుమార్ ఈతకని ఊరి బయట ఉన్న బావిలోకి దిగాడు. ఈత రాక మునిగి పోయాడని చెప్పారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం అంజూరు చేరుకుని విజయకుమార్ మృతదేహానికి నివాళులర్పించి తల్లిదండ్రులను ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే తిరుగు ప్రయాణంలో కేవీబీపురం కొత్తకాలనీలో డయేరియాతో మృతి చెందిన శిరీష(17)కు నివాళులర్పించారు.

విద్యామిత్ర కిట్ల అందజేత

ఏర్పేడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి చేతుల మీదుగా విద్యామిత్ర కిట్లను విద్యార్థులకు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన యూనిఫాం, నోట్, పాఠ్యపుస్తకాలు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ చెంచురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్రలో భాగంగా పాఠ్య, నోట్ పుస్తకారలు యూనిఫాం, ఇతర సామగ్రిని హెచ్ఎం రమణయ్య, పాఠశాల కమిటీ సభ్యులు శుక్రవారం పంపిణీ చేశారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజల సేవ



నారాయణవనం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువై ఉన్న కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని పద్మావతి అమ్మవారి ఊంజల సేవను వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఊంజల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయ అధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

విద్యా దోపిడీని అరికట్టండి: ఏఐఎస్ఎఫ్



వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పుత్తూరు టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యతో వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ సంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయలు ఫీజు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మెటీరియల్, ఫీజుల పేరుతో దోచుకుంటున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. భాస్కర్, గోపీ, వెంకటేష్, ఆనంద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి



పుత్తూరు టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎంఈవో తిరుమలరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆళ్లూరు రాజమ్మ కుమారులు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుత్తూరు, జూన్13(ఆంధ్రజ్యోతి): మండలంలో సబ్‌స్టేషన్‌లో చేపట్టనున్న మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో పట్టణ ఏఈ జయసాయి తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కూడా ఉంటుందని ఏఈ తెలిపారు.

విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎంవీఐ

పుత్తూరు అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలు తమ విద్యార్థులను తరలించే వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని పుత్తూరు ఎంవీఐ చంద్రశేఖర్ చెప్పారు. పుత్తూరు ఎంవీఐ పరిధిలో వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు, సత్యవేడు మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో మొత్తం 177 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 154 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకున్నాయి. మిగిలిన 23 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోవాల్సి ఉందన్నారు. ఫిట్‌నెస్ లేని వాహనాల్లో పిల్లలను పంపవద్దని తల్లిదండ్రులకు ఎంవీఐ సూచించారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

గడువులోగా ఈకేవైసీ పూర్తి చేసుకోండి

సత్యవేడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు అర్హులైన రైతులు ఈనెల 20వ తేదీలోగా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని ఏవో మురళి తెలిపారు. రైతులు వారి పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ అసిస్టెంట్లను కలిసి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ ఉల్లం'ఘనులు'

- నిమ్మకు నీరెత్తిన అధికారులు
- ఇబ్బంది పడుతున్న పట్టణవాసులు



కొత్తపేటలో నడిరోడ్డుపై సరుకులు దింపుతున్న వాహనం

శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొందరు బడా వ్యాపారులు కనీస ట్రాఫిక్ నిబంధనలను పాటించడంలేదు. అరికట్టాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో ప్రజలు ట్రాఫిక్ చిక్కుల్లో నిత్యం విలవిలాడుతున్నారు. పట్టణంలోని కొత్తపేటలో పట్టపగలు రద్దీ వేళలో నడిరోడ్డుపై సరుకులు దింపుతున్న లారీ ఇదీ. కొత్తపేట పట్టణ నడిబొడ్డు కావడంతో ఈ మార్గం అత్యంత రద్దీగా ఉంటుంది. సరిగ్గా ఇదే ప్రదేశంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు మరో ఐదు ప్రైవేటు పాఠశాలలు పక్కపక్కనే ఉన్నాయి. అలాగే పెద్దఎత్తున వ్యాపార సంస్థలు, ప్రైవేటు వైద్యశాలలు కూడా ఇక్కడికి సమీపంలో ఉన్నాయి. ఇంతటి రద్దీ రోడ్డులో కొందరు బడా వ్యాపారులకు సరుకు రవాణా చేసే లారీలు నిబంధనలకు విరుద్ధంగా అన్‌లోడ్ చేస్తున్నాయి. రద్దీ వేళలో ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించకూడదన్న నిబంధన ఉంది. అయితే అది కొందరికి వర్తింప జేయడంలేదన్న విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. కొందరు వ్యాపారులు ఎంతో దీమాగా పాఠశాల వేళల్లో సైతం తమ సంస్థ ఎదుట భారీ వాహనాలను ఉంచుతున్నారు. దీంతో ఆ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు స్తంభించిపోతున్నాయి. పట్టణంలోని చాలా కీలకమైన రోడ్లపై ఇదే తంతు కొనసాగుతోంది. బడా వ్యక్తులు దర్జాగా ట్రాఫిక్ ఉల్లంఘనలు సాగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఉల్లంఘనలపై దృష్టి సారించాల్సి ఉంది.

రక్తదానంతో ప్రాణదానం



శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని శ్రీకాళహస్తి స్టేట్‌బ్యాంకు ప్రధానశాఖ మేనేజరు ఫణికుమార్ అన్నారు. పట్టణంలోని స్టేట్ బ్యాంకులో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి వైద్యుడు మణి మాట్లాడుతూ రక్త దానం సామాజిక బాధ్యతగా భావించా లన్నారు.

పైరులో విషపూరిత మందు చల్లారని ఫిర్యాదు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపెళ్లూరులో తన పొలంలో విషపూరిత మందును చల్లారంటూ రైతు కె.విజయకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ... తన అనుభవంలో ఉన్న ఎనిమిది ఎకరాల్లో రెండు నెలల క్రితం వరి నాటానన్నారు. రెండు రోజుల క్రితం మూడు ఎకరాల్లో విషపూరిత మందు చల్లడంతో పైరు చివరి భాగంలో ఎండిపోయినట్లిందన్నారు. పాత కక్షల నేపథ్యంలో గ్రామంలోని ఐదుగురు ఈ పనికి పాల్పడి ఉంటారని పేర్కొన్నారు. మూడు ఎకరాలలోని పంట పూర్తిగా ఎండిపోయిందని, సూమరు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించండి

పిచ్చాటూరు/నాగలాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. శుక్రవారం ఉదయం పిచ్చాటూరు, నాగలాపురంలలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్‌తో కలిసి నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రాల భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా రోగ్యానికి విరివిగా నిధులు కేటాయించి, వైద్యులను, సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం, వైద్యాధికారులు మునిచరిత, ధనుష్, ఎంపీడీవో మహ్మద్ రఫి, డీపీఎంవో శివయ్య, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

బలిజలను బీసీలో చేర్చాలని పాదయాత్ర

శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బలిజలను బీసీల్లో చేర్చాలని ఒంగోలుకు చెందిన సాన ప్రసాద్‌రాయల్ చిత్తూరు నుంచి అమరావతికి పాదయాత్ర చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం శ్రీకాళహస్తికి చేరుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, బలిజ నాయకులు అక్కడికి చేరుకుని ఆయన పాదాయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ... ప్రసాద్ రాయల్ చేపట్టిన పాదయాత్రకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని శ్రీకాళహస్తీశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, స్వర్ణమూర్తి, సిద్ధులుగారి ప్రసాద్, దండు రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత హారన్ల తొలగింపు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జీపులు, సుమోలు యజమానులు, డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిషేధిత హారన్లు తొలగించారు. సంఘం నాయకులు విష్ణునివాసం వద్ద ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆధ్వర్యంలో 50 వాహనాలకు నిషేధిత హారన్లు తొలగించారు. కొన్ని రోజులుగా వివిధ ప్రదేశాల్లోని భక్తుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకుని నిషేధిత హారన్లపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఇంకా ఎవరైనా అలాంటి హారన్లు కలిగి ఉంటే తొలగించాలని డీఎస్పీ కోరారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రగతి సంస్థ సభ్యులు

శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని కార్మికశాఖ అధికారులు, పోలీసులు, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కేవీ రమణ చెప్పారు. పట్టణంలోని వస్త్ర దుకాణాలు, హోటళ్లు ఇతర దుకాణాల్లో బాలలు ఎవరైనా పనిచేస్తు న్నారా అని తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా 8-18 సంవత్సరాల లోపు బాలకార్మికులను గుర్తించారు. దుకాణ యజమానులపై తగు చర్యలు తీసుకోనున్నారు. బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించి విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిన్నలాలప్ప, అధికారులు శ్రీమన్నారాయణ, రంగనాథం, ప్రవీణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ యానాది సంఘం అధ్యక్షుడు చందమామల కోటయ్య, ప్రగతి సంస్థ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు. కాగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బెంగళూరుకు చెందిన క్రైసంస్థ సహకారంలో కృషి చేస్తున్నట్టు ప్రగతి సంస్థ తెలిపింది.

పాఠశాలల విలీనాన్ని ఆపండి



ఏ.పార్లపల్లిలో బడికి తాళం వేసి పిల్లలతో తల్లిదండ్రుల నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ.పార్లపల్లి ప్రాథమిక పాఠశాల విలీనాన్ని ఆపాలంటు బడికి తాళం వేసి గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... తమ గ్రామ పాఠశాలలోని 3, 4, 5 తరగతులను పీవీకండ్రిగ పాఠశాలలో విలీనం చేయడం వల్ల పిల్లలు కిలోమీటరు దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందన్నారు. పాఠశాల విలీనం ఆపాలని గతంలో పాఠశాల కమిటీ ద్వారా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిన పట్టించుకోలేదని తెలిపారు.తమ గ్రామ పాఠశాలలోనే 3, 4, 5 తరగతులను ఉంచాలని లేదంటే పాఠశాలకు పిల్లలను పంపమని తల్లిదండ్రులు హెచ్చరించారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో పాఠశాలలో విలీనం చేయొద్దని పేరడం గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు సర్పంచ్ కనకరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ... గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 4, 5 తరగతులను మదనంబేడు పాఠశాలలో విలీనం చేయడం వల్ల తమ పిల్లలు చదువులకు దూరం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంఈవో 2 ఉషకు వినతిపత్రం అందించారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభం



పశువుల నీటి తొట్టె ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కేవీబీపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజూరు లో శుక్రవారం ఎమ్మెల్యే ఆదిమూలం రెండు పశువుల నీటి తొట్టెలను ప్రారంభించారు. అనంతరం అంజూరుపాళెం - జయలక్ష్మీపురానికి వెళ్లే మార్గంలో కాళంగి యేరుపై రూ.5కోట్లతో నిర్మించనున్న కాజ్‌వేకు భూమిపూజ చేశారు. అలాగే రూ.3.60 లక్షలలో నిర్మించిన బోనుపల్లి - జయలక్ష్మీపురం సిమెంటు రోడ్డును ప్రారంభించారు. కొట్టాలమిట్ట ఎస్టీకాలనీకి వెళ్లే కళత్తూరు కాలువపై కూడా త్వరలోనే వంతెన నిర్మిస్తామని చెప్పారు. సర్పంచులు బాలాజీ, డాక్టర్ రమేష్, టీడీపీ నాయకులు రామాంజులనాయుడు, గోపీనాథ్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, జయరామిరెడ్డి, ఎంపీడీవో మాలతి, ఇన్‌ఛార్జి తహసీల్దారు మధుసూదన్, పంచాయతీ డీఈ ప్రభాకర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ బాబు, ఎంఈవో లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపేడు ఎస్టీకాలనీలో పోలీసు పికెట్



ఎంపేడు ఎస్టీకాలనీలో డ్రోన్ కెమెరాతో నిఘా

శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపేడు ఎస్టీకాలనీలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. గత కొద్ది నెలలుగా ఎస్టీకాలనీలోని రెండు వర్గాల మధ్య విబేధాలు తలెత్తాయి. తరచూ ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటుండటంతో శ్రీకాళహస్తి డీఎస్పీ పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి ఎంపేడు ఎస్టీకాలనీ వాసులతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. శుక్రవారం గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే డ్రోన్ కెమెరాలను ఎగురవేసి పరిశీలించారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు.

మూడు ఫీడర్ల ఏర్పాటు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లమాల సబ్‌స్టేషన్‌లో కొత్తగా మూడు త్రీఫేజ్ ఫీడర్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఈ భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ... గతంలో కాటూరు, ఆలత్తూరు, పల్లమాల ఫీడర్లు ద్వారా వ్యవసాయ కనెక్షన్లతోపాటూ గృహాలకు విద్యుత్ సరఫరా అయ్యేదన్నారు. దీంతో గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా సక్రమంగా రాక ఇబ్బంది పడేవారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి పల్లమాల సబ్‌స్టేషన్‌లో మూడు ఫీడర్లు ఏర్పాటు చేశామన్నారు. దీంతో కత్తివారికండ్రిగ, దొంగలము దూరు, పీవి కండ్రిగ, బసవన్నగుంట, ఏ.పార్లపల్లి, కారాకొల్లు, వేణుగోపాలపురం, పీఎస్‌గుంట, పచ్చాలమ్మకాలనీ, ఆలత్తూరు, నక్కవారికండ్రిగ, పీఎస్‌పురం, కొత్తపాళెం, తుమ్మగుంట, కాటూరు, పద్మావతిపురం తదితర గ్రామాలకు 24 గంటల పాటు నిరంతరాయంగా సరఫరా ఉంటుందని తెలిపారు. ఏఈలు చలపతి, రవి, బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, 11 కేవీ లైన్ల నెలవారీ నిర్వహణ కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడుల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ ఆధ్వర్యంలో బీడీ కార్మికుల కుటుంబాల విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పట్టణంలోని బీడీ కార్మికుల వైద్యాధికారి వెంకట భాస్కర్ తెలిపారు. 1నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఆగస్టు 31లోపు, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ప్రొఫెసనల్ కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబరు 31లోపు సం బంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఏవోల బాధ్యతల సీకరణ

ఏర్పేడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయశాఖ అధికారిగా బి.సాగరిక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాగరిక అన్నమయ్య జిల్లా సంబేపల్లి ఏవోగా పని చేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఏర్పేడు మండల ఏవోగా బాధ్యతలు స్వీకరించారు.

శ్రీకాళహస్తి(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండల వ్యవసాయాధికారిగా మమత శుక్ర వారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి వారికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

పారిశుధ్య సామగ్రి పంపిణీ

ఏర్పేడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అవసరమైన వస్తుసామగ్రిని అందజేశారు.ఏర్పేడు సర్పంచ్ ఎన్.శివయ్య అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి శ్రీమతి, తెలుగుమహిళ నాయకురాలు గాలి కృష్ణవేణి వీటిని అందజేశారు. పంచాయతీలో పారిశుధ్య కార్మికుల కృషిని అభినందించారు.

శాస్త్రోక్తంగా శుక్రవార ఉత్సవం



శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు.

ఘనంగా పొంగళ్లు



ఏర్పేడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకండ్రిగలో శీతలాంబ, రేణుక ఎల్లమ్మలకు గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. మాజీ ఎంపీపీ కోటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.